₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 01

జనవరి 01-15, 2019




## 'పౌరసేవల' చట్టంతోనే అవినీతి అంతం

## 'హ్యాపీనెస్' చిరునామా..!








## లోక్‌పాల్, బలమైన లోకాయుక్త కోసం పోరాటం



# ఇంటి దగ్గర నీటి సమస్యకు ఇట్టే పరిష్కారం!

పట్టణ ప్రాంతాల్లో వాననీ తేలిగ్గా నీటవనరుగా మార్చుకునేందుకు తాను రూపొందించిన విధానాన్ని ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ ఇంజినీర్ ఎం. ధర్మారావు హైదరాబాద్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఫౌండేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డిఆర్) పరిశోధనా బృందానికి వివరించారు. ఈ విధానం వల్ల అందుబాటు ఖర్చుతో భూగర్భ జలాల్ని పెంచుకుంటూ నీటికొరతను అధిగమించవచ్చు. ఏ నివాస ప్రాంతంలోనైనా దీన్ని ఉపయోగించుకోవచ్చని, వేగంగా పట్టణీకరణ నేపథ్యంలో దేశవ్యాప్తంగా నీటిసమస్య పరిష్కారానికి ఇది దోహదం చేస్తుందని ధర్మారావు తెలిపారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జనవరి 01-15, 2019 సంపుటి - 10 సంచిక - 01




కంగ్రాట్స్, తేవాలనుకుంటే ఏ బిల్లునైనా ఇట్టే పాస్ చేయించగలరు.

## కార్టూన్ కార్నర్

## లోపలి పేజీల్లో...

పాలన చూసి ఓటేయమనే ధైర్యం ఏ నేతకూ...... 5
నిజమైన హీరోలను తయారు చేసే చదువులు.... 6
ఎన్ని జెండాలున్నా... సరైన ఎజెండాలేకే కూటమి.. 7
ఓటు నా హక్కు - నా బాధ్యత......................... 8
ప్రజలను బిచ్చగాళ్లను చేస్తారా?....................... 11
మధ్యప్రదేశ్ గోడలపై వ్యక్తమైన సందేశం............ 14
పౌరసేవల్లో జాప్యం, లంచం ఉంటే ............ 17
'గణతంత్రం'లో ఆదివాసీ స్ఫూర్తి...................... 18
తెలంగాణ అనుభవం తర్వాతైనా ప్రచారాన్ని...... 21
2019 ఎన్నికల్లోనైనా 'మార్పు'కి.................... 22
హ్యాపీనెస్ చిరునామా...!.............................. 24
'పౌరసేవల' చట్టంతోనే అవినీతి అంతం............30
ఫలించిన లోక్‌సత్తా ప్రయత్నం.. పేట ప్రజల ....... 31

### సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# మీ అభిప్రాయాలు చెప్పండి..

ఆత్మీయ పాఠకులారా!

లోక్‌సత్తా భావజాలాన్ని ఇతరత్రా మార్గాలతో పాటు రకరకాల ప్రచురణల ద్వారా కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గత 22 ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాం. ఏ అంశం మీదైనా, ఎంత సంక్లిష్టమైన, వివాదాస్పదమైన, భావోద్వేగపూరితమైన సమస్యమీదైనా లిఖితపూర్వకంగా తన వైఖరిని చెప్పే సాహసం, నిబద్ధతగల రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా! సమాజంలో, దేశంలో, ప్రపంచంలో మునుపెన్నడూ లేనంత శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నా కూడా.. లోక్‌సత్తా భావజాలం ఇప్పటికీ చెక్కుచెదరకుండా దిక్సూచిగానే కొనసాగుతోందని ఈ ప్రచురణల్లో భాగస్వాములైనవారిగా నిర్ద్వంద్వంగా చెప్పగలుగుతున్నాం. వీలైనన్ని ఎక్కువ ప్రచురణలతో నిరంతరాయంగా ఈ అజరామర భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాన్నదే మా (మీ) ఆకాంక్ష. మ్యాగజైన్ ప్రచురణల్లో భాగంగా పక్షపత్రికగా 'లోక్‌సత్తా టైమ్స్'ని, మాసపత్రికగా 'జనబలం'ని తీసుకొస్తున్నామని మీకందరికీ తెలుసు. ఇటీవలికాలంలో ప్రింట్ ధర, ఇతర ఖర్చులు పెరిగిపోవటంతో ఈ పత్రికల ప్రచురణ భారంగా మారింది. మన వనరులకు - పత్రికల వ్యయానికి పొంతన కుదరటం లేదు. ఇదేసమయంలో ఏదోకరూపంలో భావజాలాన్నయితే ప్రజల్లోకి తీసుకెళ్తూండాలి. ఈ నేపథ్యంలో.. ఏ వేదిక ద్వారా ప్రచురితమైనా లోక్‌సత్తా టైమ్స్, జనబలం రెండూ లోక్‌సత్తా భావజాల పత్రికలే కాబట్టి రెంటినీ విలీనం చేసి ఒకే పత్రికగా తీసుకురావలనే ప్రతిపాదన వచ్చింది. "రెండిటిలో ఏది తేవాలి, పక్షపత్రికగానా లేక మాసపత్రికగానా, ప్రింట్ ఎడిషన్‌గానా, ఆన్‌లైన్ పత్రికగానా?".. అనే చర్చ జరుగుతోంది. లోక్‌సత్తా కుటుంబ సభ్యులుగా ఈ అంశాలకు సంబంధించి మీ అభిప్రాయాలను కూడా తెలియచేయండి. మొత్తాన్నీ కూలంకషంగా సమీక్షించి నిర్ణయం తీసుకుందాం. అయితే ఆలస్యమయ్యేకొద్దీ భారం పెరుగుతుంది. డిసెంబర్-జనవరిల్లోనే నిర్ణయం అమల్లోకి వచ్చేయాలి. మీ అభిప్రాయాల్ని, ఆదాయాన్ని పెంచుకునే మార్గాల సూచనల్ని దిగువ పేర్కొన్న ఐడీలకి సాధ్యమైనంత త్వరగా ఈ-మెయిల్ చేయవలసిందిగా మనవి.

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

– ఎడిటోరియల్ టీం

# పాలన చూసి ఓటేయమనే ధైర్యం ఏ నేతకూ, పార్టీకీ లేదు





**త**మ పాలనను చూసి ఓటు వేయమని అడిగే సత్తా ముఖ్యమంత్రి కేసీఆర్ సహా ఏ నాయకుడికీ, పార్టీకీ లేదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ అన్నారు. ప్రజలకు సరైన పాలన అందించలేకే ప్రధాన రాజకీయ పార్టీలు ఉచితాల్ని, తాయిలాల్ని ప్రకటించటం, కులం, మతం, ప్రాంతం వంటి ఆదిమకాలంనాటి ఉద్రేకాలను రెచ్చగొట్టటం చేస్తున్నాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అని తేడా లేకుండా కొద్దిపాటి మినహాయింపులతో దేశవ్యాప్తంగా ఇదే తరహా దుర్రాజకీయం, దుష్పరిపాలన కొనసాగుతున్నాయన్నారు. దీంతో మనది పేరుకు ప్రజాస్వామ్యం.. వాస్తవంలో నాయకస్వామ్యం, ఉద్యోగస్వామ్యం, ధనస్వామ్యంగా మారిపోయిందన్నారు. ఈ దుర్రాజ్యమనే మాయలఫకీరు ప్రాణాలు కేంద్రీకృత పాలన అనే చిలకలో ఉన్నాయన్నారు. దేశంలో కేంద్రీకృత పాలనను అంతం చేసి, జనం ఇంటి ముందుకు, కళ్ల ముందుకు పాలనను తీసుకొస్తేనే ప్రజాస్వామ్యానికి సంకెళ్లు తెగు తాయన్నారు. సురాజ్య పాలన నెలకొని, తాయిలాలు, ఉచితాలు, డబ్బు, మద్యం వంటి ప్రలోభాల అవసరం లేకుండా ప్రజలు సరైన వారికి ఓటు వేయటం, తమ పన్నుల డబ్బులో ప్రతి రూపాయినీ తమ నిజమైన అభివృద్ధి కోసం వినియోగించుకోవటం ప్రారంభిస్తారన్నారు.

'రాష్ట్రాల స్వయంప్రతిపత్తి- రాజ్యాంగంలో అడ్డంకులు, పరిష్కారం'పై కరీంనగర్ ఫిలింభవన్‌లో లోక్‌సత్తా ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు శ్రీనివాస్, భండారి అంకయ్య గౌడ్, ప్రకాష్ హోల్లా, చంద్రప్రభాకర్, బెల్లి రాజయ్య, శంకర్ తదితరులతో కలిసి జేపీ పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు.

జేపీ మాట్లాడుతూ.. తమ ఓటుకు - తమ బతుక్కు సంబంధం లేకుండా అత్యధిక శాతం ప్రజలు ఓటు వేసే రీతిలో మన వ్యవస్థను కేంద్రీకృతం చేసి కొందరు నాయకుల ఇష్టారాజ్యంగా మార్చేశా రన్నారు. దేశ స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా భయాందోళనలతో అప్పట్లో అన్ని అధికారాలనూ ఢిల్లీలో కేంద్రీకరించారని, ఆ తర్వాత 1980లలో ఎన్.టి రామారావు, కరుణానిధి, బిజూ పట్నాయక్ వంటి వారు పోరాడి కొంత మేర రాష్ట్రాలకు హక్కులను సాధించా రన్నారు. దీనివల్ల మనదేశం రెండో దశ ఫెడరలిజాన్ని సాధించిందని, కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు గణనీయంగా పెరిగాయన్నారు. కానీ ఇప్పటికీ అధికారాలు ఢిల్లీలోనే కేంద్రీకృతమై ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పిల్లలకు మంచి చదువు అందించాలన్నా, ఢిల్లీ నుంచి అనుమతి కావాలని, కరీంనగర్‌లో తెలంగాణ పట్ల ప్రేమ, కొన్ని రంగాలలో నిష్ణాతత ఉన్నవారి సేవలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలంటే క్యాడర్ రూల్స్ పేరుతో కేంద్రం ఒప్పుకోదని, తెలంగాణలో స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ఎలా జరగాలో రాజ్యాంగంలో పొందుపరిచారని, ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ ఇలాంటి పరిస్థితి లేదన్నారు.

కరీంగనర్‌లో ఏం చేయాలో ఢిల్లీ వాడికేం తెలుసు? అక్కడున్న ఎవరో అధికారికి మన అవసరాలేం తెలుస్తాయి? వాళ్లు ఏదో ప్రణాళిక వేస్తే, ఇక్కడ మనం అమలు చేస్తుంటే సమస్యలు ఎలా తీరతాయి?.. అని జేపీ ప్రశ్నించారు. చివరికి కమ్యూనిస్టు నియంతృత్వ చైనాలో కూడా రాష్ట్రాలకు, స్థానిక ప్రభుత్వాలకు మనదేశంలో కంటే ఎక్కువ అధికారాలున్నా యన్నారు. పాతకాలపు కేంద్రీకృత పాలన మారితే తప్ప.. ఆధునిక అవసరాలు, అవకాశాలు, ఆకాంక్షల కనుగుణంగా పాలన చేయటం సాధ్యం కాదన్నారు. ఇందుకోసం మూడో దశ ఫెడరలిజం కావాలని, కేంద్రం నుంచి మరిన్ని అధికారాలకు రాష్ట్రాలకు రావాలన్నారు. మౌలికమైన అంశాలన్నిటిలో ప్రపంచంలోని 50 పెద్ద దేశాలలో భారతదేశం చివరి నాలుగైదు స్థానాల్లో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ భద్రత, విదేశీ వ్యవహారాలు, రక్షణ, కరెన్సీ, అంతర్రాష్ట్ర వివాదాలు వంటి అంశాలకు పరిమితమై, మిగిలిన అంశాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలన్నారు. రాష్ట్రాల్లో తప్పు జరిగితే చర్యలు తీసుకోవచ్చన్నారు. దీంతోపాటు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలన్నారు. ఈ మూడంచెల మూడో దశ ఫెడరలిజం కోసం లోక్‌సత్తా రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ ప్రారంభించిన కృషిని ముమ్మరం చేస్తామన్నారు. రుణమాఫీలతో రైతుల జీవితాలు బాగుపడవని, వారు పండించిన పంటకు లాభసాటి ధర వచ్చే విధానాలను అనుసరించాలన్నారు.

తెలంగాణలో సాగునీటి వసతికి ఎవరికీ అభ్యంతరాలు ఉండాల్సిన పన్లేదని, కానీ ప్రజాధనాన్ని పెట్టుబడి పెట్టినప్పుడు అత్యుత్తమ ఫలితాలనిచ్చే పథకాలని, ప్రాజెక్టులని చేపట్టాలని,

పొదుపరితనం వుండాలని జేపీ వ్యాఖ్యానించారు. అటవీశాఖ అధికారులను అవినీతి నిరోధక శాఖకు పట్టించిన కరీంనగర్‌కు చెందిన జి.వేణుకుమార్‌ను జేపీ సన్మానించారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతున్నా, అంతా బాగున్నట్లు పాలకులు నటిస్తున్నారన్నారు. పోలీసు ఉద్యోగాన్ని అడ్డం పెట్టుకుని మోహన్‌రెడ్డి చేసిన దోపిడీకి బాధితులైన వారికి లోక్‌సత్తా తోడ్పాటునిచ్చిందని, సమస్య పరిష్కారమయ్యేంత వరకూ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దుల బాలకృష్ణ లోక్‌సత్తాకు రూ.15,116 విరాళంగా ఇచ్చారు. ✧

# నిజమైన హీరోలను తయారు చేసే చదువులు కావాలి

వ్యక్తి, సమాజం, దేశం బాగుపడాలంటే ఒకే ఒక్క మార్గం.. మంచి విద్య అని డా॥ జేపీ అన్నారు. పాఠశాల విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగు పరిచేందుకు 'సదిశ' సంస్థ ద్వారా కృషి చేస్తున్న గోవర్ధన్‌కు మద్దతుగా అందుకే కరీంనగర్‌కు వచ్చానన్నారు. తాను మొట్టమొదట సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన కరీంనగర్‌లో ఇంత మంచి కార్యక్రమం జరుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడ జరిగినా తాను హాజరవటానికే ప్రయత్నిస్తానని, ఇది ఏ ఒక్కరి పనో అనుకోకుండా అందరం మద్దతివ్వాల్సి ఉందని, గోవర్ధన్ కృషి కరీంనగర్‌ను దాటి తెలంగాణలోని అన్ని జిల్లాలకూ విస్తరించాలని అన్నారు.



కరీంనగర్ జిల్లా చొప్పదండిలోని ఉన్నత పాఠశాలలో సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని జడ్పీ స్కూళ్ల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించి ప్రతిభ గల విద్యార్థుల ఇంటర్మీడియెట్‌(+2) చదువుకయ్యే ఖర్చును సదిశ స్పాన్సర్ చేస్తోంది.

సమాజాన్ని దోచుకుని సంపాదించేవాళ్లు ఎన్ని వందల కోట్లు సంపాదించినా అది సంపద పెరగటం కాదని, సమాజాన్ని పెంచేలా డబ్బు సంపాదిస్తే అదీ సంపద పెరగటమని, అందుకోసం చేసే పనే ఉపాధిని పొందటమని జేపీ అన్నారు. అలా ప్రతి ఒక్కరూ ఉపాధిని పొందుతూ, సంపదసృష్టిలో భాగమమవ్వాలంటే మంచి చదువు తప్ప వేరే మార్గం లేదన్నారు. కానీ ప్రస్తుత చదువులు ఆ రకంగా లేవన్నారు. మనిషి వేటాడమనే పని చేసినప్పుడు, పదివేల ఏళ్ల క్రితం నుంచి చేస్తున్న వ్యవసాయంలోనూ అక్కర్లేని నైపుణ్యాలు ఇప్పుడు అవసరమని, వాటికి తగ్గట్టు విద్యాప్రమాణాలు మన వద్ద పెరగటం లేదన్నారు. తెలంగాణలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో పలువురు రెండంకెల తీసివేతను, భాగాహారాన్ని చేయలేని వైనాన్ని, 14-18 సంవత్సరాల మధ్యవారు గడియారం చూసి సమయాన్ని సైతం చెప్పలేని తీరును గణాంకసహితంగా జేపీ వివరించారు. తెలంగాణలో ఒక్కో బిడ్డ మీద పాఠశాల చదువుకు ప్రభుత్వం రూ.45,000-50,000 వెచ్చిస్తున్నా, అత్యధికులకు చదువు మాత్రం అందటం లేదన్నారు. బిడ్డల చదువుకోసం తల్లిదండ్రులు త్యాగాలు చేస్తున్నా, ప్రభుత్వం డబ్బు బాగానే ఖర్చు చేస్తున్నా ఎందుకు చదువు రావటంలేదోనన్న తీవ్ర మథనం అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో, దేశవ్యాప్తంగా కూడా విద్యారంగం దుస్థితిలోనే ఉందన్నారు. 2009లో జరిపిన 'పీసా' సర్వేలో 74 దేశాలు పాల్గొంటే, భారత్‌కు ఎంత ర్యాంకు వచ్చిందో తెలుసా? అని జేపీ ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి తెలుసుకోవటానికి ప్రయత్నించారు. తలోక అంకెను పిల్లలు చెప్పారు. భారత్‌కు ఇందులో 73వ ర్యాంకు వచ్చిందని, ఈ సర్వే గురించి పదిమందికి తెలిస్తే అందులో ఐదుగురికి తాను పనిగట్టుకుని ప్రచారం చేయటం వల్లే తెలిసిందంటూ సర్వే ప్రత్యేకతను వివరించారు. ఈ సర్వే గణితం, విశ్లేషణా సామర్థ్యం, సైన్స్ వంటి అంశాలలో అప్లికేషన్ చేయగల సామర్థ్యాలను ప్రధానంగా పరీక్షించిందన్నారు. మన ర్యాంకు అధ్వాన్నం కావటంతో ఆ తర్వాత సర్వేలో పాల్గొనబోమని భారతదేశ పాలకులు తప్పించుకున్నారన్నారు. తెలంగాణ ఇటీవలి ఎన్నికల్లో పార్టీలు, నేతలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం, ఒకరినొకరు దుమ్మెత్తిపోసుకోవటం చూశాక ఉద్రేకాలకు లోనై ఎవరోకరి పక్షాన నిలవటం సైన్స్ అప్లికేషన్ కాదని, వారు చెప్పేదాంట్లో వాస్తవమేంటి, వాస్తవాలను రూఢి చేసుకుని సరైన విధానాన్ని ఎలా రూపొందించుకోవాలి.. అన్నదే సైన్స్ అప్లికేషన్ అని వివరించారు. ఈ శక్తి మన విద్యావ్యవస్థకు లేదని పీసా సర్వే బైటపెట్టిందన్నారు. ఇలాంటి శక్తి విద్యార్థుల్లో పెంపొందించే చదువు కోసం గోవర్ధన్ పరిమిత ఖర్చుతో తన పరిధిలో ప్రయత్నిస్తున్నారని, ఏ ప్రాంతంలో, కులంలో, మతంలో పుట్టినా ఇలాంటి ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన ఓ యువకుడు, కానిస్టేబుల్‌గా ఉన్న ఓ ముస్లిం ఈ ఉమ్మడి లక్ష్యం కోసం ఒకే వేదిక మీదకు రావటాన్ని ఆయన ఉదహరించారు. తామంతా సామాన్య కుటుంబాల్లో పుట్టినా వేదిక మీద దిశానిర్దేశం చేసే స్థాయికి ఎదిగామంటే, అది మంచి చదువు వల్లే సాధ్యమైందని వివరించారు. తండ్రి పదవిలో ఉంటే వంశపారంపర్యతతో ఆ పదవిలోకి వచ్చే కొడుకు హీరో కాదని, సమాజానికి ఉపయోగపడటం ద్వారా సంపద సృష్టిస్తూ ఎదిగేవాడు నిజమైన హీరో అని, అలా ఎదిగే అవకాశం మంచి చదువు ద్వారానే సాధ్యమని జేపీ వివరించారు. ముచ్చర్ల గోవర్ధన్‌రెడ్డి, వసీం, ప్రధానోపాధ్యాయురాలు కరుణ, నాగేశ్వరరావు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. ✧

# ఎన్ని జెండాలున్నా.. సరైన ఎజెండాలేకే కూటమి ఓటమి

రకరకాల జెండాలు, నిజాయతీపరులైన ఉద్యమకారులు ఉన్నా.. సరైన ప్రత్యామ్నాయ ఎజెండా లేకపోవటం వల్లే కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజాకూటమి ఓటమి పాలైందని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సాతులూరి గోవిందరావు అన్నారు. టీఆర్ఎస్ తాయిలాల్ని, స్కీముల్నే కాంగ్రెస్ కూడా చెప్పటం వల్ల ప్రజలు ఎక్కువ రిస్కు తీసుకోకుండా కేసీఆర్‌కే మళ్లీ పట్టం కట్టారన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన మొత్తం ఐదు రాష్ట్రాల్లోనూ తెలంగాణలోనే 'నోటా'కు గతంలో కంటే ఓట్లు పెరిగాయని, ప్రజలు టీఆర్ఎస్, కాంగ్రెస్ పసలేని ఉచితాలు, పథకాలతో విసిగి పోతున్నారనటానికి ఇదో నిదర్శనమన్నారు. సరైన ప్రత్యామ్నాయం ఉంటే టీఆర్ఎస్‌ను కూడా ఓడిస్తామని ప్రజలు పరోక్షంగా హెచ్చరించారన్నారు. లోక్‌సత్తా ఈ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరు అంశాల నిర్దిష్ట ఎజెండాను పార్టీలు, ప్రజల ముందుకు తెచ్చిందని.. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ



కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలకు చట్టం, మహిళల భద్రతకు స్థానిక కోర్టుల ఏర్పాటు, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు, వ్యవసాయం లాభసాటి అనే ఈ ఆరు అంశాల ఎజెండాను పట్టించుకోనంత వరకూ ప్రజల్లో పార్టీలకు, నేతలకు నిజమైన ఆదరణ లభించదన్నారు. బంగారు తెలంగాణను సాకారం చేసే శక్తి లోక్‌సత్తా ఎజెండాకే ఉందన్నారు.

# 'పౌర సేవల' చట్టాన్ని సాధించుకుందాం.. అవినీతి వ్యతిరేక పోరుకు పటిష్ఠ పునాది వేద్దాం

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని రాయదుర్గం పట్టణంలో లోక్‌సత్తా పార్టీ ప్రజాచైతన్య కార్యక్రమాలను నిర్వహించింది. ఇందులో భాగంగా 'అందరం కలిసి సాగుదాం – అవగాహనతో అవినీతిని అరికడదాం' నినాదంతో అవినీతి వ్యతిరేక కరపత్రాలను పంపిణీ చేశారు. లోక్‌సత్తా నియోజకవర్గ ఇంఛార్జి వెంకటరమణబాబు, పార్టీ నేతలు హనుమప్ప, ఆంజనేయులు నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు 'పౌర సేవల' చట్టాన్ని తెచ్చేందుకు లోక్‌సత్తా గట్టి ప్రయత్నం చేస్తోందన్నారు. అవినీతి వ్యతిరేక పోరుకు ఈ చట్టం పటిష్ఠ పునాది అవుతుందని, సుపరిపాలనలో పెద్ద మైలురాయి అవుతుందని అన్నారు. అవినీతిని



అరికట్టేందుకు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, వృత్తిసంఘాలు ముందుకొచ్చి అవగాహనతో పోరాటం చేయాలని, పౌర సేవల చట్టానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సాంబారా? పసుపుచారా?

పేద విద్యార్థులకు రుచి లేకుండా తినలేని వంటకాల్ని సరఫరా చెయ్యటం అన్యాయమని లోక్‌సత్తా పార్టీ యువసత్తా విజయనగరం అధ్యక్ష, కార్యదర్శులు రొక్కం గురునాధం, లెంక లక్ష్మణరావు అన్నారు. పసుపుచారులాంటి సాంబారు, ఉడకని బియ్యం పెడుతున్నారన్నారు. పట్టణంలోని నాగోజీపేటలో ఉన్న పురపాలక పాఠశాలను వారు సందర్శించి విద్యార్థులనడిగి వివరాల్ని తెలుసుకున్నారు. విజయనగరంలో ఒక్క పాఠశాలకైనా మౌలికసదుపాయాల్ని కల్పించారేమో ఎమ్మెల్యే గీత, ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ చెప్పగలరా? అని వారు ప్రశ్నించారు. యువసత్తా ప్రతినిధులు పీఎల్ఎన్ రాజు, పెంటబాబు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు నా హక్కు - నా బాధ్యత

- పి.వి గోపాలకృష్ణ



అని నమ్మి నిజాయితీగా ఓటు వేద్దామని వెళ్లిన కొంతమంది, ఓటర్ల లిస్టులో పేర్లు కనబడలేదని మొత్తుకుంటే శ్రీ ఎలక్షన్ కమిషన్ వారన్న మాట–

"It is the responsibility of the citizens to check their names in the list at least once in a year. If they find their names deleted, the missing voters and also the new voters can enroll themselves either through BLOs or online".

సమంజం కాదు సమర్థనీయం కాదు.

ఏమాటకామాట, ఈ విషయంలో జాతి కుల మత భాషా భేదాలకతీతంగా సమానత్వాన్ని సాధించిన ఘనత శ్రీ ఎలక్షన్ కమిషన్‌ది. ఎలక్షన్ క్రతువులో బలిపశువులు కాడానికి సామాన్యులు, అసామాన్యులు, ప్రముఖులు అన్న భేదం లేదని రుజువు చేసింది.

రాష్ట్రంలో మొన్న జరిగిన ఎన్నికల్లో ఓటర్స్ లిస్ట్ తయారీలో ఉపయోగించిన సాంకేతిక ఆల్గరిథ్మ్ వల్ల లక్షల్లో పేర్లు మాయమయ్యాయన్నది సరిగాదని ఎలక్షన్ కమిషన్ ఖండించింది. వారిలో ఓటర్ ఐడిలున్నవాళ్ళు, ఏళ్ళ తరబడి ఒక్కచోటనే ఉంటున్నవాళ్ళు, గత ఎలక్షన్‌లు ఎన్నింటిలోనో ఓటు హక్కు వినియోగించుకుంటున్నవాళ్ళు, ఎలక్షన్ కమిషన్ వారి ఉచిత సలహాననుసరించి, బూత్ లెవెల్ ఆఫీసుల్లో ఓటర్స్ లిస్ట్‌లు అందుబాటులో ఉంచినప్పుడల్లా తమ పేర్ల తనిఖీ చేసుకున్నవాళ్ళూ ఉన్నారు. ఏ కారణం వల్ల ఈసారి పేర్లు మాయమయ్యాయన్నది ప్రస్తుతం హైకోర్ట్‌లో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో ఎలక్షన్ కమిషన్ దాఖలు చేయబోయే కౌంటర్‌లో తెలియవలసి ఉంది.

కానీ ఇదేమీ కొత్త విషయం కాదు. ఎలక్షన్ జరిగిన ప్రతిసారీ పత్రికల్లో మనం చూసేది తమ పేరు లిస్టులో లేదని ఓటర్ ఐడిలు చూపిస్తూ తిట్టుకుంటూ, ఏడ్చుకుంటూ ఇళ్ళకు తిరిగివెళ్ళేవారి ఫోటోలు, వార్తలు. దీనికి కారణాలు ఎలక్షన్ కమిషన్ నిర్వహణలోనే ఉన్నాయన్నది నిజం. రాజకీయపరమైన కారణాలున్నాయన్నది కేవలం అనుమానం. దానికి తగిన సాక్ష్యాలు, ఆధారాలు దొరకవు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి తిరిగి ఓటర్‌ల పేర్లు నమోదు, తనిఖీ ప్రక్రియలకు, ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్‌కి శాశ్వత సిబ్బంది ఉండదు. ఎన్నికల కమిషన్‌లో ఒక్క చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ తప్ప ఎన్నికల పని కోసం పూర్తి సమయాన్ని కేటాయించే శాశ్వత సిబ్బంది ఉండదు. ఎన్నికల సమయంలో మాత్రమే అవసరమయ్యే విషయం కనుక శాశ్వత సిబ్బంది నియామకం అనవసరం, నిర్వహణ ఖర్చు దృష్ట్యా. అందువల్ల ఆపద్ధర్మంగా ఇతర రాష్ట్ర ప్రభుత్వ శాఖల సిబ్బంది ఆయా సందర్భాలలో ఎలక్షన్ కమిషన్ అధీనంలో పనిచేయవలసి ఉంటుంది. వారికిచ్చే శిక్షణ, వారి నైపుణ్యం, అనుభవం, ప్రాథమిక జ్ఞానం, వీటిని బట్టి పేర్ల నమోదు, తనిఖీ ప్రక్రియలలో దొర్లే తప్పులు అందరికీ అనుభవమే. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోను ఓటర్ల జాబితా తయారీ, సవరణ, విశ్వసనీయతకి బాధ్యత వహించడానికి తాత్కాలిక ప్రాతిపదిక మీద పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది బూత్‌లెవెల్ ఆఫీసర్‌గా నియమించ

బడుతున్నారు. ఈ పద్ధతి 2006 నుంచి అమలులో ఉంది.

ఫిజికల్‌గా బతుకున్నామా చచ్చేమా అని తెలుసుకోడానికి డాక్టర్ దగ్గరకెళ్ళనక్కర్లేదు కానీ పొలిటికల్‌గా ఉన్నామా పోయేమా అని తెలుసుకోవాలంటే మాత్రం శ్రీ ఎలక్షన్ కమిషన్ వారు జారీ చేసే వార్షిక జాబితాల్లో వెతుక్కోవలసిందే. ఒకసారి ఒక పేరు ఓటర్ జాబితాలోకి ఎక్కిన తర్వాత అది ఎలా, ఎందుకు కనిపించకుండా పోతుంది అన్న ప్రశ్నకి సరైన సమాధానం ఇంతవరకు ఎలక్షన్ కమిషన్ ఇవ్వలేదు. ఏళ్ళ తరబడి ఒక్కచోటే ఉంటున్నవాళ్ళు, ఆ ముందు ఎలక్షన్‌లో కూడా ఓటు చెయ్యగలిగిన వాళ్ళ పేరు ఉన్నట్టుండి ఎందుకు మాయమై పోతుంది.

అంతలా తుమ్మితే ఊడిపోయే ముక్కా ఓటు.

ప్రతి సంవత్సరం లేదా జాబితాలు సవరించినప్పుడల్లా తన పేరుందో లేదో చూసుకోవలసిన బాధ్యత ఓటరుదేనంటోంది ఎలక్షన్ కమిషన్. జాబితా తయారీలో తాము చేసే తప్పుల వల్ల ఎలక్షన్ రోజు పేరు కనబడకపోతే బాధ్యత ఓటర్‌దే. ముందస్తుగా జాబితాలో పేరు తనిఖీ చేసుకోవలసిన బాధ్యత ఓటర్‌దే అనడం ఓటర్ మీదకి నెపం నెట్టడమే. ముందుగా తనిఖీ చేసుకున్నప్పుడున్న పేర్లు కూడా చివరి నిముషంలో కనబడలేదని సైతం కొందరి ఫిర్యాదు. తమ తప్పులేదని ఎలక్షన్ కమిషన్ ఆ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చెయ్యక, మీ ఓటు మా బాధ్యత అని అనగలిగే పరిస్థితి ఎందువల్ల లేదు? చేతకానితనం. అసమర్థత. కనీసం, ఇన్ని సంవత్సరాల అనుభవం దృష్ట్యా, ఎంతమంది పేర్లులేక ఓటు వెయ్యకుండా వెళ్ళిపోయారన్నది పోలింగ్ రోజు పోలింగ్ బూత్ వారీగా తెలుసుకునే ప్రయత్నం ఇన్నేళ్ళలో ఒక్కసారి కూడా చెయ్యలేదు. పేర్లు కనబడని వారికి విచారం వ్యక్తం చేసి, లక్షల్లో ఆ సంఖ్య లేదని ఖండించినంత మాత్రానా సరిపోతుందా! అది పదుల్లోనో, వందలలోనో, వేలల్లోనో అని చెప్పలేనప్పుడు, అప్పటికప్పుడు కాకపోయినా మళ్ళీ దరఖాస్తుల ప్రమేయం లేకుండా వారి వారి EPIC నెంబర్ల ఆధారంగా జాబితాలో వారి పేర్లు పునరుద్ధరిస్తామని చెప్పలేని అధికారగణాన్ని చేవగలిగినవారు, సమర్థులు అని అనగలమా? దానికి కావలసిన సమర్థత లేదని ఒప్పుకోకపోగా నెపం బాధ్యతా యుతులైన పౌరుల మీదకు నెట్టడం చేతగానితనానికి పరాకాష్ఠ.

మా పేర్లు కనబడలేదు మొర్రో అంటూంటే ఉన్నపేరు ఊడినవాళ్ళు, కొత్తవాళ్ళూ కూడా బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారానో ఆన్‌లైన్‌లోనో రిజిస్టర్ చూసుకోండి అన్నదా జవాబు. ఈ ప్రక్రియ మొత్తం మీద ఒక ఓటర్‌కి నిరంతరంగా ఉండే బూత్, ఆ బూత్‌కి సంబంధించిన ఆఫీసర్ ఎవరని తెలుసుకునే అవకాశం ఉందా. ఎంతమందికి ఆన్‌లైన్‌లో తెలుసుకునే జ్ఞానం, అవకాశం ఉన్నాయి? బూత్ లెవెల్‌లో ఒక ఆఫీసు ఉంటుందా అక్కడ ఒక ఆఫీసర్ ఉంటాడా? బూత్ లెవెల్ ఆఫీసర్లుగా 13 కేటగిరిలలోని పాక్షిక/పూర్తి స్థాయి ప్రభుత్వ సిబ్బంది నుంచి నియమిస్తారు. వారిలో టీచర్లు, కాంట్రాక్ట్ టీచర్లు, అంగన్‌వాడీ పనిచేసేవారు, ఎలక్ట్రిసిటీ బిల్ రీడర్లు, కార్పొరేషన్ ట్యాక్స్ కలెక్టర్లు, పోస్ట్‌మెన్, నర్సులు, మిడ్‌వైఫ్‌లు, హెల్త్ వర్కర్లు, మిడ్ డే మీల్ వర్కర్లు, యూడీసీలు, ఎల్డీసీలు, ఇత్యాదులుంటారు. వీరి చదువు, జ్ఞానం, అనుభవం, నిబద్ధత మీద ఓటర్ జాబితాల తయారీ, సవరణలుంటాయి. ఆన్‌లైన్ దరఖాస్తులైనా చివరికి వీరు చేసే తనిఖీ మీద ఆధారపడి ఉంటుంది. వీరికి ప్రత్యేకంగా బూత్ లెవెల్ ఆఫీసంటూ ఎక్కడా ఉండదు.

ఇక ప్రజాస్వామ్యంలో తిరుగులేని రాజ్యాంగ సూత్రం వ్యక్తి స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్రం. ఈమధ్య వీటిని పరిరక్షించే విధంగా వచ్చిన ముఖ్యమైన సుప్రీంకోర్టు తీర్పులు వివాదాస్పదం అయ్యాయి కూడా. ఎన్నికల విషయంలో ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఉద్ధరించే విధంగా పౌరులందరికి అందుబాటులోకి వచ్చిన హక్కు ఎన్నికలలో పోటీపడుతున్న అభ్యర్థులలో ఎవరినీ ఎన్నుకోవలసిన అగత్యం లేదన్న NOTA హక్కు. ఇది రాజ్యాంగబద్ధమైన హక్కుగా సుప్రీంకోర్టు కూడా ఒప్పుకున్నది. ఆ హక్కు ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతోంది కూడా. రాబోయే పంచాయతీ ఎన్నికలలో NOTA హక్కు ఉపయోగించుకునే సావకాశం కల్పించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్టు ఈమధ్యే ప్రకటించారు. అభ్యర్థుల ఎంపికలో తామవలంబిస్తున్న పద్ధతికి జనాదరణ లేదన్న విషయం పార్టీలు గ్రహించేవరకు క్రమేణా ఆ ధోరణి సన్మార్గం పట్టే వరకు NOTA అవసరం ఉంది. అంతే కానీ రాజ్యాంగబద్ధం కాని నిర్బంధ ఓటు జనం మీద రుద్దడం వలన సాధించేది ఏమీ లేదు.

మొన్న జరిగిన ఎన్నికల్లో కూడా నిర్బంధ ఓటింగ్ జరిగిందేమోనని అనిపించేలా ఉంది ఎలక్షన్ కమిషన్ వ్యవహారం. ఎన్నికల మర్నాడు మీడియాలో అన్ని ఛానల్స్,

వాటి అనుబంధంగా ఉన్న పత్రికలు ఒక పక్క వాళ్ళకి కావలసిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చెప్పుకున్నా, సార్వత్రికంగా అందరూ ఒప్పుకున్నది ఓటింగ్ శాతం ఏమాత్రం ఆశాజనకంగా లేదన్నదే. గత ఎన్నికల కంటే మూడు, నాలుగు శాతం తక్కువ అని కూడా అంచనా వేశాయి. హైదరాబాదు ఓటర్లలో సగంమంది కూడా ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఎన్నికల రోజు (డిసెంబర్ 7) సాయంత్రం 4.45కి, ఇంకా పావుగంట సమయం మాత్రమే ఉన్నప్పుడు, నేను ఓటు హక్కు వినియోగించుకున్న. నాంపల్లి నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 232లోని 1,234 మంది ఓటర్లలో 470 మంది మాత్రమే ఓటు వేశారు. అంటే కేవలం 38 శాతం. ఆశ్చర్యకరంగా, ఎన్నడూలేని విధంగా ఎన్నికల కమిషన్ ఆ మర్నాటి రాత్రి దాకా ఓటింగ్ శాతం ప్రకటించలేదు. ఆ ప్రకటించిన ఓటింగ్ శాతాలు, ముఖ్యంగా రూరల్ నియోజకవర్గాలలో, ఎనభై-తొంభైగా ఉండడం, అనుమానాలకి తావిచ్చే విధంగా ఉన్నాయి.

ఇది చాలదన్నట్టు, ఎన్నికల ప్రక్రియ ఎంత ప్రజాహితంగా ఉందో చూస్తే, అభ్యర్థిని చూసి ఓటు వేద్దామనుకుంటే పార్టీ బాగుండదు, పోనీ పార్టీని చూసి వేద్దామంటే అభ్యర్థి బాగుండదు. ఇక స్వతంత్రులంటారా ఎన్నికలైన మరుక్షణం తమ స్వాతంత్రాన్ని పార్టీలకు తాకట్టు పెట్టేయడానికి, తమని ఎన్నుకున్న ఓటర్ల మనోగతం ఏమాత్రం ఆలోచించాల్సిన అవసరంలేదనుకునేంతటి స్వతంత్రులు. ప్రతి పార్టీ సైద్ధాంతిక భావదారిద్ర్యంలో పీకల్దాకా మునిగిపోయింది. రాజకీయ వ్యాభిచర్యాన్ని సమర్థించే విధంగా ఉండే "శాశ్వత మిత్రత్వం, శాశ్వత శత్రుత్వం ఉండవన్న" సూత్రాన్ని మనసవాచకర్మణ పూర్తిగా నమ్మి పనిచేస్తున్నాయి ప్రస్తుతం పార్టీలన్నీ, జాతీయ, ప్రాంతీయ భేదం లేకుండా. Devil or Deep sea ఏదో ఒక్కటే తేల్చుకో అని నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. గన్నా, తాడా దేంతో చస్తావో తేల్చుకోమనడం ప్రజాస్వామ్యాన్ని వెక్కిరించడమే.

ప్రజాప్రతినిధన్నవాడు ప్రజాభిప్రాయంతో ప్రమేయం లేకుండా పనిచేసే పనికిమాలిన ప్రజాస్వామ్యాన్ని డెబ్బై యేళ్ళుగా పెంచి పోషిస్తున్నాం. ప్రజాభాగస్వామ్యంతో పనిచేసే ప్రజాస్వామ్యాన్ని నిర్మించే ప్రయత్నం ఇన్నేళ్ళలో జరగకపోవడం విషాదం. నా నియోజకవర్గంలో ఇంతమంది లోక్‌పాల్ చట్టం కావాలని కోరుతున్నారు లేదా వ్యతిరేకిస్తున్నారు అనో, పౌర సేవల చట్టాన్ని ఇంతమంది సమర్థిస్తున్నారనో చెప్పగలిగే విధంగా ప్రజాభిప్రాయ సేకరణకి ధైర్యంగా ఒక రెఫరెండం తమ నియోజకవర్గంలో నిర్వహించగలిగే ప్రజాప్రతినిధి ఒక్కడినైనా తయారుచేయగలిగిందా ఏ పార్టీ అయినా? ఏ నిర్ణయమైనా పార్టీ అధినాయకత్వం చెప్పినట్టు ఒప్పేసుకోడమే తప్ప తన నియోజకవర్గ ప్రజలలో అత్యధికుల ప్రజాభిప్రాయం తెలుసుకుని దాన్ని అధినాయకత్వానికి ఎదురు నిలిచి చెప్పగలిగే సత్తా ఉన్న ఒక్క ప్రజాప్రతినిధినైనా దేశం మొత్తం మీద ఎక్కడైనా ఒక్కడినైనా తయారుచేయగలిగిందా మన ప్రజాస్వామ్యం. ఎమ్‌పిలకి దేశీయంగానో, ఎమ్ఎల్ఏలకి రాష్ట్రీయంగానో సాధ్యం కాదనుకున్నా, పోనీ స్థానికంగా కొన్ని ఎంపిక చేసుకున్న పోలింగ్‌బూత్‌ల పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ - రెఫరెండం - నిర్వహించగల కౌన్సిలర్నో, కార్పొరేటర్నో చూడగలమా? అధినాయకత్వానికి విరుద్ధంగా ఏ విషయాన్నైనా చెప్పగలిగే సాహసం ఏ ప్రజాప్రతినిధైనా చెయ్యగలడా ఈరోజు. ఈనాటి స్మార్ట్ ఫోన్ల యుగంలో ప్రజాభిప్రాయ సేకరణ అంత కష్టసాధ్యమైన ప్రక్రియ ఎంతమాత్రమూ కాదు. ప్రజాధనాన్ని వాటాలేసుకుని దిగమింగెయ్యడమే ప్రజాప్రతినిధులందరి ముఖ్య సిద్ధాంతం. ఈ పార్టీ ఈ సిద్ధాంతానికి అపవాదం కాదు. ఎన్నికల్లో వాళ్ళు పెట్టే అంతులేని ఖర్చే దాన్ని సమర్థించు కోడానికి వాళ్ళకున్న ఒకే ఒక సాకు.

యూరోపియన్ యూనియన్‌లో బ్రిటన్ కొనసాగాలా వద్దా అన్న ప్రశ్నకి కొనసాగవద్దన్న నిర్ణయాన్ని 2016లో జూన్ 23న జరిపిన BREXIT రెఫరెండంలో అర్హులైన 4 కోట్ల 65 లక్షల ఓటర్లలో 72.2 శాతం మంది జనాభిప్రాయం మీద ఆధారపడి తీసుకున్నారు. మన దేశంలో ఏ విషయం మీదైనా ఏ రెఫరెండం కూడా నిర్వహించలేమన్న నిర్ణయాన్ని ఎవరు ఎప్పుడు ఎలా తీసుకున్నారో తెలీదు. కానీ దాని ఫలితం మాత్రం ఇన్నేళ్ళుగా అనుభవిస్తున్నాం. అదే పార్టిసిపేటరీ డెమోక్రసీని పుట్టకుండా చంపేయడం. అటువంటి ప్రక్రియ ప్రజాస్వామ్యంలో ఉండాలన్న స్పృహ కూడా లేని వారు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైపోడం చూస్తే ప్రజాస్వామ్యం అంటే మనకున్న అవగాహన ఎంతో బాగా అర్థమవుతుంది.

ఈ మన ప్రజల, మన ప్రజల వలన, మన ప్రజల కొరకు, మన ప్రజల చేత, మన ప్రజల యొక్క ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి. ✧

# ప్రజలను బిచ్చగాళ్లను చేస్తారా?

- తిగుళ్ల కృష్ణమూర్తి

*ఉద్యమకారుడిగా పనిచేసిన కేసీఆర్, సైనికుడిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మార్పు కోరే పార్టీ ప్రతినిధి లక్ష్మణ్, సంస్కరణల పార్టీ నేత రమణ, విద్యావేత్త కోదండరాం కలసి రాజకీయాలకు అతీతంగా ఒక మాట అనుకుంటే, ఈ అనుచిత హామీల విషవలయం నుంచి తెలంగాణను బయటపడేయడం పెద్ద కష్టమేం కాదు. అందరూ ఒక మాటమీదుంటే రాజకీయంగా ఒకరికే నష్టం జరుగుతుందనే భయమూ ఉండదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నేతలు తమ జాతి ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా ఏకమైనట్టే, అనుచిత హామీలను అదుపు చేసే విషయంలో తెలంగాణ నేతలు ఒక్కటవ్వాలి. అప్పుడు తెలంగాణ నిజంగానే దేశానికి దారి చూపిన రాష్ట్రమవుతుంది. లేకపోతే అప్పు అనే నిప్పును కొంగున కట్టుకుని తెలంగాణ దెబ్బతినడం ఖాయం. మనం మన పిల్లల కోసం వ్యక్తిగత ఆస్తుల్ని పోగేస్తున్నాం. కానీ ఒక జాతిగా దెబ్బతింటే మనం ఎన్ని ఆస్తులు కూడబెట్టినా పైసాకు కొరగావు. అందువల్ల రేపటి తరాల బాగు కోసం ఐదుగురు నేతలూ ఏకాభిప్రాయానికి వస్తారా? రాజనీతిజ్ఞులు అనిపించుకుంటారా? లేక రాజకీయులుగానే మిగిలిపోతారా?*

'ప్రభుత్వ పథకాలన్నీ మంచిగున్నయి. పుట్టిన బిడ్డలకు, బాలింతలకు సర్కారు అన్నీ ఇస్తున్నది. గట్లనే ఇరవై ఒక్క దినం (బారసాల– నామకరణ దినోత్సవం) ఖర్చు కూడా ఇస్తే మంచిగుంటది సారూ!'

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఓ నేతతో ఒక మహిళ అన్న మాట ఇది! తెలిసి అన్నదో తెల్వక అన్నదో గానీ ఆమె మాటలో ఎంతో అర్థం ఉంది!

ఎన్నికలు ఎలాగూ అయిపోయాయి. గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలూ అలవిగాని హామీలు ప్రకటించాయి. అన్నీ ఉచితంగా ఇస్తామని ఊరించాయి. అయితే అందలం ఎవరికి అందినా, ఆనందం మాత్రం అందని మానిపండే! ఎందుకంటే తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఆర్థికంగా పతనం అంచున ఉంది. అధికారాన్ని చేపట్టే పార్టీ ఏదైనాగానీ, ఇప్పటికే ఉన్న పథకాల, కొత్తగా చేసిన వాగ్దానాల అమలు కత్తిమీద సాములా మారబోతోంది. ఆర్థికభారం, ద్రవ్య నిర్వహణ కొత్త ప్రభుత్వం నెత్తిన కత్తిలా వేలాడబోతోంది. ఇప్పటికే ఉన్నవి పోను టీఆర్ఎస్ కొత్త హామీల అమలుకు 85 వేల కోట్లు కావాలి. కానీ రాష్ట్ర ఖజానాకు నికర ఆదాయం ఏడాదికి సుమారు 88 వేల కోట్లే! ఇచ్చిన హామీలను నిజాయతీగా అమలు చేయాలంటే, ఆదాయం



అకస్మాత్తుగా రెట్టింపుకన్నా మించాలన్నమాట. అల్లావుద్దీన్ అద్భుతదీపం తెచ్చినా అది అసాధ్యం. రాష్ట్ర ఆదాయంలో వార్షిక వృద్ధి 14–16 వేల కోట్లు మాత్రమే! ప్రజలపై పన్నుల విధింపులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. పన్నుల వసూలు రేటులో కూడా మనమే నెంబర్‌వన్! అందువల్ల కొత్తగా పన్నుల ద్వారా ఆదాయం పిండుకునే అవకాశం పెద్దగా లేదు. అమ్ముదయ్యే ప్రభుత్వ భూములు గుంటెడు లేకుండా పోయాయి. ఖజానాకు మహారాజ పోషకులైన తాగుబోతులు... 'ఇక ఇంతకంటే మేం తాగలేంగాక తాగలేం' అంటూ తప్పతాగి గిలగిలా తన్నుకుని రోడ్ల మీద పడిపోతున్నారు! అందువల్ల ఎక్సైజ్ ఆదాయం కూడా పెద్దగా పెరిగే ఛాన్స్ లేదు. పెట్రోలు, డీజిలుపై పన్ను మన రాష్ట్రంలోనే గరిష్ఠంగా ఉంది కనుక, దాన్నింకా పెంచి సొమ్ములు గుంజలేం. అప్పులు కూడా గరిష్ఠ స్థాయికి చేరి, కొత్తగా పుట్టని పరిస్థితి ఉంది. స్థూల రాష్ట్రీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో 3.5 శాతం వరకు ఏటా

అప్పు తెచ్చుకోవచ్చు. 2018–19లో తెలంగాణ జీఎస్‌డీపీ అంచనా 8.43 లక్షల కోట్లు. ఇందులో 3.5 శాతం అంటే... దాదాపు 30 వేల కోట్ల అప్పు తెచ్చుకునే అర్హత ఉంది. ఆ పరిమితి ఎప్పుడో చేరుకున్నాం. ఇప్పటికే చేసిన బాకీలకు భారీగా వడ్డీలు కట్టాల్సిన టైమొచ్చింది. సాధారణంగా ప్రభుత్వం పదేళ్ల కాలానికి అప్పులు తీసుకుని, పదో ఏట నుంచి చెల్లింపు మొదలుపెడుతుంది. కానీ ఖజానా నిండుకోవడంతో 15, 20, 25 ఏళ్ల కాలానికి అప్పులు తీసుకుంటున్న పరిస్థితి. ఇలా కిస్తులు కట్టలేక దీర్ఘకాల రుణాలు తీసుకుంటున్న రాష్ట్రం దేశంలో తెలంగాణ మాత్రమే! రుణ వ్యవధి పెరిగితే వడ్డీ భారం కూడా పెరుగుతుంది కదా! ఇక మిగిలింది రిజర్వుబ్యాంకు నుంచి ఓవర్‌డ్రాఫ్ట్ ఒక్కటే. కానీ ఓ.డికి వెళ్లి వారం రోజుల్లో సర్దుబాటు చేయకుంటే... ప్రభుత్వానికి సంబంధించిన అన్ని చెల్లింపులనూ ఆపేయాల్సిందిగా బ్యాంకులను ఆర్బీఐ ఆదేశిస్తుంది. గవర్నర్ జీతం, హైకోర్టు జడ్జి పెట్రోలు ఖర్చు సహా అన్నీ ఆగిపోతాయి. రాష్ట్రం పరువు బజారున పడుతుంది. అలా నిబంధనలను కఠినతరం చేసిన కేంద్రం మరోవైపు తానిచ్చే జీఎస్‌టీ వాటాను కూడా ఆలస్యంగా 20వ తేదీన చెల్లిస్తున్నది. దీంతో ప్రతి నెలా మొదటి తారీఖు వస్తున్నదంటే ఆర్థికశాఖ అధికారులు బెంబేలెత్తి పోతున్నారు. ఉద్యోగులకు జీతాలు సర్దుబాటు చేయడమే కనాకష్టంగా మారింది. నెలనెలా అప్పోసప్పో చేసి, చిల్లర శ్రీమహాలక్ష్మి అనుకుంటూ అక్కడా ఇక్కడా ఏరుకొచ్చిన సొమ్ముతో జీతాలు చెల్లిస్తున్నారు. 2004లో సాచ్యురేషన్ పేరుతో సర్కారు సొమ్మును స్కీమ్‌ల పేరిట విచ్చలవిడిగా పంచి పారేసిన వైఎస్, 2009లో గెలిచే నాటికి సంక్షోభంలో చిక్కుకున్నారు. అనుకోకుండా చనిపోయారు కానీ, బతికుంటే కష్టాలు తప్పకపోయేవి! ఇప్పుడూ ఆనాటి సంక్షుభిత పరిస్థితే నెలకొంది. ఒక్కమాటలో చెప్పాలంటే మన రాష్ట్రం సుమారు 15 ఏళ్లకు సరిపడా ఖర్చును గత ఐదేళ్లలోనే చేసేసింది. రేపు ఎవరైనా అధికారం చేపట్టవచ్చు. కానీ పుట్టబోయే బిడ్డల మీద అప్పుల భారం మోపే అధికారం మనకు లేదుగాక లేదు!

**ప్రజలు, నేతలు దొందూ దొందే!**

ఆర్థిక శాఖలో బాధ్యత, దూరదృష్టిగల సమర్థులైన ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు వంటి ఉన్నతాధికారులు ఉన్నందున లోగుట్టు పెరుమాళ్లకెరుక అన్నట్టుగా ఇంతకాలం పరువు బజారున పడకుండా ఆగింది! కానీ ఇలా ఎంతోకాలం కొనసాగే అవకాశం లేదు. ఉద్యోగులు ఐఆర్–ఫిట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగులు భృతి కోసం, రైతులు రుణమాఫీ కోసం, పెన్షనర్లు పెరిగే పింఛన్ కోసం, డబుల్ ఇళ్ల లబ్ధిదారులు 50 వేల గ్రాంట్ కోసం, ఇంకా రకరకాల వర్గాలు రకరకాలుగా హామీల అమలు కోసం ఎదురుచూస్తున్నారు. నేతలు పైకి ఇదంతా సంక్షేమమని ప్రచారం చేసుకుంటున్నారు. తక్షణ తాత్కాలిక లబ్ధిని ఆశించి జనం ఓట్లేస్తున్నారు. నిజం చెప్పాలంటే అటు ప్రజలు, ఇటు పార్టీల నాయకులు/పాలకులు నైతికంగా పాతాళానికి దిగజారిపోయారు. ఎన్నికల పేరుతో సాగిన మద్యం, డబ్బు పంపిణీ చూస్తే అసహ్యం వేసింది. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలనే యావతో నేతలు ప్రజలను బిచ్చగాళ్లుగా మారుస్తున్నారు. ఉచితం అంటే అర్థం.. తగినది అని! కానీ దాన్ని 'ఫ్రీ (అ–మూల్యం)' అంటే విలువలేనిదిగా మార్చేశారు. అవసరం ఉన్నవాడికి లేనివాడికి పందేరం చేస్తున్నారు. ఇక ఇంతకంటే వథకాలుగా ప్రకటించడానికిగానీ, పతనమవడానికిగానీ ఏమీ మిగల్లేదు. పార్టీలుగానీ, నాయకులుగానీ తమ సొంత ఆస్తులమ్మి పథకాలు అమలు చేయరు, మళ్లీ మన మీదో, మన పిల్లల మీదో భారం మోపుతారన్న ఇంగితజ్ఞానం ప్రజలకు లేదు. ప్రజలను సోమరిపోతులుగా మార్చడం వల్ల రాష్ట్ర భవిష్యత్తే దెబ్బతింటుందన్న వివేకం నాయకులకు లేదు. ఒళ్లు గుల్లయ్యేలా తాగబోసి, వాడి శరీరం నాశనమయ్యాక ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయడం ఏం సంక్షేమం? ప్రభుత్వ ఉద్యోగి 61 ఏళ్లు పనిచేయడం ఏమిటి? పెన్షనర్లకు 57 ఏళ్ల నుంచే పింఛన్ ఇస్తామనడం ఏమిటి? పిలగాడికి నిరుద్యోగ భృతి ఇచ్చి, పిల్లకు పెళ్లి ఖర్చిచ్చి, గర్భిణికి ప్రసూతి ఖర్చులిచ్చి, వృద్ధులకు ఇంటికి రెండు పెన్షన్లిచ్చి, ఉచితంగా సన్నబియ్యం ఇచ్చి, గ్యాస్ సిలిండర్లిచ్చిన తర్వాత ఎవడైనా ఇక ఎందుకు పనిచేయాలి? ఎవడూ ఏ పనీ చేయకపోతే ప్రభుత్వానికి ఆదాయం సమకూరేది ఎలా? పనిచేస్తే అభివృద్ధి జరుగుతుందా లేక అన్నీ ఉచితంగా ఇచ్చి ఇంట్లో పండబెడితేనా? ఒకవేళ ఆదాయం లేక ప్రభుత్వం దివాలా తీస్తే, అప్పటికే పని అలవాటు మరచిపోయిన జాతి రేపు ఎలా బతుకుతుంది? పని సంస్కృతిని

పెంచితే సృజనాత్మకత పెరుగుతుందా లేక తాగబోసి మత్తులో ముంచితేనా? చేపను వేటాడడం నేర్పిస్తే ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తారా, తామే చేపను కొట్టుకొచ్చి వండి కంచంలో పెడితేనా? అలా ఎన్నాళ్లు పెట్టగలరు?

**ఇకనైనా మేలుకుంటారా?**


అప్పు చేసి పప్పుకూడు ఇప్పుడు బాగానే ఉంటుంది. కానీ ఆ తర్వాత రాష్ట్రం అన్యాయమై పోతుంది. 27.96 లక్షల కోట్ల జీఎస్‌డీపీ ఉన్న మహారాష్ట్ర ప్రభుత్వానికి ఏటా 80 వేల కోట్ల దాకా అప్పు చేసే అనుమతి ఉన్నా 20 వేల కోట్లు మించి చేయవద్దని రూల్ పెట్టుకుంది. మనమూ దీనిని ఆదర్శంగా తీసుకోవాలి. మన మార్గాన్ని సరిచేసుకోవడానికి ఇదే సమయం. 'వారిజాక్షులందు వైవాహికములందు...' మాత్రమే కాదు, రాష్ట్రం కోసం రాజకీయాల్లో కూడా అబద్ధాలు ఆడవచ్చు. మంచి కోసం మాట తప్పితే తప్పేం లేదు. లోక్‌సభ ఎన్నికలు అయిపోయే దాకా కొత్త పథకాల అమలును వాయిదా వేయాలి. ఆ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను నిపుణులతో మదింపు వేయాలి. అనారోగ్యకరమైన పోటీని పక్కనబెట్టి, వాస్తవాలను శ్వేతపత్రం రూపంలో ప్రజల ముందుంచాలి. ఇప్పుడప్పుడే ఎన్నికలేమీ ఉండవు, ఓడిపోతామనే భయాలేమీ ఉండవు. ఆకలయ్యేవాడికి అన్నం పెడితే రుచి. ఆపన్నులకు, అసహాయులకు, అవసరార్థులకు మాత్రమే ప్రభుత్వ సహాయం అనే ప్రాతిపదికన నూతన ఆర్థిక- సంక్షేమ విధానాన్ని ఆవిష్కరించాలి. ఆర్థికవేత్తలను సంప్రదించి ఎక్స్‌పెండిచర్ రేషనలైజేషన్ (వ్యయ హేతుబద్ధీకరణ) అమలు చేయాలి. రైతు బంధు వంటి పథకాలు అవసరార్థులకు మాత్రమే అందేలా 'పదెకరాల లోపు ఉన్నవారికే- పంట వేసిన వారికే' అన్న షరతులు పెట్టాలి. దీనివల్ల వేలకోట్లు మిగుల్చుకోవచ్చు. పెరిగే జీవనవ్యయం, ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఉద్యోగులకు ఎప్పటికప్పుడు కరువుభత్యం అందుతున్నందున, ఫిట్‌మెంట్‌పై పరిమితి పెట్టాలి. ఏటా రాష్ట్ర ఆదాయం 15-18 శాతం మాత్రమే పెరుగుతున్నందున, అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా, ఉద్యోగులకు ఐదేళ్లకోసారి 15 శాతానికి మించి జీతాలు పెంచకుండా చట్టం చేయాలి. ఉద్యోగుల పనితీరును దానికి ముడిపెట్టాలి. ఉత్పాదక రంగంపై, పరిశ్రమల ఏర్పాటు వంటి ఉపాధి కల్పన సౌకర్యాలపై ఖర్చును పెంచాలి. తద్వారా సర్వీసెస్ సెక్టార్‌పై ఆధారపడే అగత్యాన్ని తప్పించాలి. శాసనమండలి, కార్పొరేషన్ల వంటి రాజకీయ పునరావాస కేంద్రాల్ని రద్దు చేయాలి. లగ్జెంబర్గ్ అనే చిన్న ఐరోపా దేశంలో, కాలుష్యాన్ని తగ్గించడం కోసం ప్రజలందరికీ ఉచిత రవాణా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారట. భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి ఆలోచనలు చేయాలి. రాష్ట్రంలో 600లకు పైగా పథకాలు అమలవుతున్నాయి. వీటిలో చిల్లర మల్లర పథకాలన్నీ తీసేయడం ద్వారా దాదాపు 3 వేల కోట్లు మిగుల్చుకోవచ్చన్నది ఒక లెక్క. వ్యయ హేతుబద్ధీకరణ, పెరిగే ఆదాయం ద్వారా ఏటా 30 వేల కోట్ల దాకా అందుబాటులోకి తెచ్చుకుంటే తప్ప రాష్ట్రం గట్టెక్కే పరిస్థితి లేదు.

అందువల్ల ఉద్యమకారుడిగా పనిచేసిన కేసీఆర్, సైనికుడిగా పనిచేసిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మార్పు కోరే పార్టీ ప్రతినిధి లక్ష్మణ్, సంస్కరణల పార్టీ నేత రమణ, విద్యావేత్త కోదండరాం కలసి రాజకీయాలకు అతీతంగా ఒక మాట అనుకుంటే, ఈ అనుచిత హామీల విషవలయం నుంచి తెలంగాణను బయటపడేయడం పెద్ద కష్టమేం కాదు. అందరూ ఒక మాటమీదుంటే రాజకీయంగా ఒకరికే నష్టం జరుగుతుందనే భయమూ ఉండదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నేతలు తమ జాతి ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా ఏకమైనట్టే, అనుచిత హామీలను అదుపు చేసే విషయంలో తెలంగాణ నేతలు ఒక్కటవ్వాలి. అప్పుడు తెలంగాణ నిజంగానే దేశానికి దారి చూపిన రాష్ట్రమవుతుంది. లేకపోతే అప్పు అనే నిప్పును కొంగున కట్టుకుని తెలంగాణ దెబ్బతినడం ఖాయం. మనం మన పిల్లల కోసం వ్యక్తిగత ఆస్తుల్ని పోగేస్తున్నాం. కానీ ఒక జాతిగా దెబ్బతింటే మనం ఎన్ని ఆస్తులు కూడబెట్టినా పైసాకు కొరగావు. అందువల్ల రేపటి తరాల బాగు కోసం ఐదుగురు నేతలూ ఏకాభిప్రాయానికి వస్తారా? రాజనీతిజ్ఞులు అనిపించుకుంటారా? లేక రాజకీయులుగానే మిగిలిపోతారా? ఇదే జరిగితే ఆ మహిళ అడిగినట్టు ఇరవైఒక్క దినం ఖర్చులు కూడా ప్రభుత్వమే ఇవ్వక తప్పదు!! రాజకీయ లాభం కోసం తెలంగాణకు నష్టం చేయడమా? తెలంగాణకు లాభం చేయడం కోసం రాజకీయంగా కొన్ని త్యాగాలకు సిద్ధపడడమా? ప్రజలు, నేతలు ఆలోచించుకోవాలి. ✧

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)*

# మధ్యప్రదేశ్ గోడలపై వ్యక్తమైన సందేశం

**- శేఖర్ గుప్తా,** ద ప్రింట్ ఛైర్మన్, ఎడిటర్-ఇన్-చీఫ్




*గత పదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత అత్యధికస్థాయి వ్యవసాయరంగ అభివృద్ధిని మధ్యప్రదేశ్ నమోదు చేసింది. ఇది ఓటర్లలో గొప్ప సంతృప్తిని తీసుకురావాలి. కానీ ఆ రాష్ట్ర సీఎం చౌహాన్ (ఇప్పుడు మాజీ) తన జీవితంలోనే అత్యంత కఠినతరమైన ఎన్నికలను ఎదుర్కొన్నారు. అభివృద్ధి పక్కకు వెళ్లి అశాంతి ఇంత తీవ్రంగా ఈ ఎన్నికల్లో ఎందుకు వ్యక్తమైంది? మధ్యప్రదేశ్ రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రంగా ఎలా రికార్డులకెక్కింది? ఉత్పత్తి పెరిగినా రైతుకు గిట్టుబాటు ధర లభించకపోతే హరిత విప్లవ కేంద్రాల్లోనూ రైతుల ఆత్మహత్యలు తప్పవు. అధిక దిగుబడి నేపథ్యంలో రైతుల జీవితాల్లో దయనీయమైన వేదనకు ఇదే మూలకారణం.*

గోడలపై రాతలు అనేది ప్రత్యేకించి ఎన్నికల ప్రచార సమయంలో భారతదేశ వ్యాప్తంగా విస్తృతంగా ఉనికిలోకి వచ్చే పదబంధం. మన నగరాలకేసి లేక వేగంగా పట్టణీకరణకు గురవుతున్న గ్రామీణప్రాంతం కేసి చూస్తే మీ కళ్లూ చెవులూ ఒక్కసారిగా విచ్చుకుంటాయి. ప్రతిచోటా గోడలపై రాసి ఉన్న విషయం లేదా దాని ప్రతిధ్వనులు దేశంలో మారుతున్నదేమిటి, మారనిదేమిటి అనే విషయాన్ని మీకు తెలియజేస్తాయి. ఇక్కడ గోడలు అంటే పరిమిత స్థలం అని వాచ్యార్థం కాదు. గుజరాత్ హైవేల పొడవునా కనిపించే ఫ్యాక్టరీల వరుసను కూడా ఈ అర్థంలోనే చూడాల్సి ఉంటుంది. లేక కాంచీపురం లోని పాత పెరియార్ విగ్రహం మీద రాసిన అక్షరాలు కూడా కావచ్చు. లేదా, తాజా ఎన్నికల సమయంలో మధ్యప్రదేశ్ లోని ఆహారధాన్యాలు, సోయాబీన్ రాశులు, కళకళలాడుతున్న మండీలు. పంజాబ్‌లో పంటకోతల కాలంలో మీరు చూసే లెక్కలేనన్ని ట్రాక్టర్ల ట్రాలీలను కూడా గమనించవచ్చు. ఇప్పుడు వ్యవసాయ గిడ్డంగుల గోడలు హైవేల పొడవునా కనిపిస్తున్నాయి.

మధ్యప్రదేశ్ నిజంగానే హరిత విప్లవం సాధించిన రాష్ట్రం. గత పదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనంత అత్యధిక స్థాయి వ్యవసాయ రంగ అభివృద్ధిని ఈ రాష్ట్రం నమోదు చేసింది. ప్రత్యేకించి గత అయిదేళ్లలో మధ్యప్రదేశ్ అసాధారణ స్థాయిలో 18

శాతం వ్యవసాయరంగ అభివృద్ధిని నమోదు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్ రజోరా తెలిపారు. ఇక టీఎన్ నినాన్ తన 'వీకెండ్ రూమినేషన్స్' (వారాంతపు చింతన) కాలమ్‌లో రాసినట్లుగా, 2010 నుంచి 2015 మధ్య కాలంలో మధ్యప్రదేశ్ వ్యవసాయ దిగుబడిలో 92 శాతం వృద్ధి నమోదైంది. చాలావరకు వ్యవసాయ ప్రధాన రాష్ట్రంగా ఉంటూ 77 శాతం గ్రామీణ ప్రాంతాలను కలిగి ఉన్న మధ్యప్రదేశ్ జనాభాలో ప్రతి పదిమందికీ ఏడుగురు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. ఇది ఓటర్ల సంఖ్య పరంగా గొప్ప సంతృప్తిని తీసుకురావాలి. గత 15 ఏళ్లుగా ఇంత అద్భుతంగా రాష్ట్రాన్ని నడిపించిన ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ నాలుగో దఫా పాలనను ఆశిస్తూ ఎంతో స్థిమితంగా కూర్చోవాలి.

కానీ 2018లో మధ్యప్రదేశ్ గోడలపై రాసి ఉన్న చిత్రణ ఇది కాదు. తన జీవితంలోనే అత్యంత కఠినతరమైన ఎన్నికలను చౌహాన్ ఎదుర్కొన్నారు. 2013లో జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీపై 9 శాతం ఆధిక్యతతో గెలుపు సాధించారన్నది పట్టించుకోవద్దు. మధ్యప్రదేశ్ వ్యాప్తంగా మేం పర్యటిస్తున్నప్పుడు మేం సమాధానం కోసం ప్రయత్నించిన ప్రశ్నలు ఇవే. వ్యవసాయరంగంలో సాధించిన అభివృద్ధి పక్కకు వెళ్లి వ్యవసాయరంగ అశాంతి ఇంత తీవ్రంగా ఈ ఎన్నికల్లో ఎందుకు వ్యక్తమవుతోంది? ప్రస్తుతం మధ్యప్రదేశ్ రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా నమోదవుతున్న రాష్ట్రంగా ఎలా రికార్డుకెక్కింది? మీరు కలుసుకుంటున్న అక్కడి రైతులు ఎందుకింత ఆగ్రహంతో ఉంటున్నారు?

ఒక దశాబ్ది కాలం వ్యవసాయ రంగ వికాసం ఇప్పుడు పెద్ద శిక్షలాగా ఎందుకు మారిపోయింది? కళ్లూ, చెవులూ, మనసు పెట్టుకుని ఈ వ్యవసాయ ప్రధాన రాష్ట్రానికి వచ్చి చూడండి. భారతీయ వ్యవసాయంలో ఎక్కడ తప్పు జరుగుతోందో అది మీకు తెలియజేస్తుంది. ఈ ప్రశ్నలకు సమాధానం కోసం సెహోర్‌కు వెళ్లండి. రాష్ట్ర రాజధాని భోపాల్‌కి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం రాష్ట్రంలోనే అతి పెద్ద మండీలకు నెలవుగా ఉంటోంది. అయితే మీరు ఎవరిని ప్రశ్నిస్తున్నారు.. రైతునా, వ్యాపారినా, మధ్యదళారినా లేక ప్రభుత్వాధికారినా అనే దానిమీదే సమాధానాలు ఆధారపడి ఉంటాయి. తన ట్రాక్టర్ ట్రాలీపై కూర్చొని ఉన్న రామేశ్వర్ చంద్రవంశీతో మేం మాట్లాడాం. సూర్యుడి ఎండలో ఈ రైతు ముఖం వాడిపోయినట్లు కనిపిస్తోంది.

'గోధుమలకి గిట్టుబాటు ధర తప్ప మాకేమీ అవసరం లేదు. వంద కేజీల గోధుమలకు రూ.3,000లు, సోయాబీన్‌కి రూ.4,000 వచ్చేలా చేస్తే చాలు' అని చెప్పాడా రైతు. ప్రస్తుతం మార్కెట్ ధరలకు ఇది 30 శాతం కంటే ఎక్కువే. పంట మీద వచ్చే నష్టాన్ని తానెందుకు భరించాలి? ఆ నష్టాన్ని ప్రభుత్వమే భరించనీయండి, లేదా ఎగుమతి చేయనివ్వండి అని తేల్చేశాడు. 'అంతకంటే మేమిక ఏదీ కోరుకోం. ఫిర్యాదులూ చేయం' అని చెబుతూ తాను 15 ఎకరాలున్న సంపన్న రైతునే కానీ దారిద్ర్యానికి దిగువన ఉంటున్న బీపీఎల్ రైతును కాదు అని రెట్టించి మరీ గుర్తుచేశాడాయన. చౌహాన్ ప్రభుత్వం దీన్ని పరిష్కరించడానికి ప్రయత్నించింది. గోధుమ, వరి పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీలు)ను పెంచారు. దీనికి అదనంగా బోనస్ కూడా ప్రకటించారు. సోయాబీన్ వంటి కనీస మద్దతుధర పరిధిలో లేని పంటలకు క్వింటాలుకు రూ.500 రైతు ఖాతాలోకి బోనస్‌గా వెళ్లింది.

తర్వాత తృణధాన్యాల వంతు. ప్రత్యేకించి పెసరపప్పు, ఉద్దిపప్పు. వీటి కనీస మద్దతు ధర వ్యాపారి చెల్లిస్తున్న ధర కంటే 60 నుంచి 90 శాతం ఎక్కువగా ఉంది. తృణధాన్యాల ధరలు పడిపోవడం వినియోగదారుడికి వరంగా మారితే రైతుకు పెనుముప్పుగా తయారవుతుంది. ఈ అంశంపై వ్యవసాయ ఆర్థికవేత్త, ఐసీఆర్ఐఇఆర్ సంస్కర్త అశోక్ గులాటిను ఈ విషయమై ప్రశ్నించండి చాలు.

మార్కెట్ ధర కంటే కనీస మద్దతు ధర దాదాపు రెట్టింపు ధరను ప్రతిపాదిస్తున్నప్పటికీ రైతు ఖర్చులను అది చెల్లించలేకపోతోందని మీరూ తెలుసుకుంటారు. కాబట్టి, రైతు ఎక్కువగా పండించే కొద్దీ ప్రభుత్వం ఎక్కువగా చెల్లిస్తుంటుంది. కానీ ఇద్దరూ కలిసి ఎక్కువ డబ్బును నష్టపోతుంటారు. మనం మూర్ఖంగా నష్టపోవడానికే చాలా కష్టపడి పనిచేస్తున్నామా? గులాటి, ఆయన తోటి స్కాలర్లు రూపొందించిన ఐసీఆర్ఐఇఆర్ వర్కింగ్ పేపర్ 339 పేజీని చదవండి. మార్కెట్లతో సమన్వయం లేకపోయినట్లయితే, ఉత్పత్తిని మాత్రమే

పెంచడం అనేది ప్రతీఘాతకంగా మారిపోతుందని ఈ నివేదిక మనకు తెలుపుతుంది.

దీనికి మంచి ఉదాహరణ కాయధాన్యాలు. సంవత్సరాల తరబడి భారతీయ మొత్తం కాయధాన్యాల ఉత్పత్తి కనీసం 3-4 మిలియన్ టన్నుల కొరతను నమోదు చేసింది. ప్రపంచం తగినన్ని కాయధాన్యాలను పెంచడానికి సతమతమవుతోంది. కానీ ధరలు మాత్రం పెరిగిపోతున్నాయి. రిటైల్ ధరలు వంద రూపాయలకు చేరుకోగానే మీడియాలో జనాగ్రహం కొట్టచ్చినట్లు కనబడుతుంటుంది. అప్పుడు ప్రభుత్వం నిద్ర మేలుకుని కనీస మద్దతు ధరను పెంచుతుంది.

కాయధాన్యాల ఉత్పత్తికి సాంకేతిక మిషన్‌ను నిర్మిస్తుంది, ఉత్పత్తిని పెంచుతుంది. దేశీయంగా కాయధాన్యాల డిమాండును 20 లక్షల టన్నుల మేరకు అధిగమించినట్లు ఐసీఆర్ఐఇఆర్ డేటా మనకు తెలుపుతుంది. కానీ పాత ఒడంబడికల వల్ల కాయధాన్యాల దిగుమతులు కొనసాగుతూనే ఉంటాయి. దీని ఫలితంగా భారత్‌కు ఏటా 22 లేక 23 మిలియన్ టన్నుల కాయధాన్యాల ఉత్పత్తి సరిపోతుండగా, దేశంలో 30 మిలియన్ టన్నుల పంట చేరుతుంటుంది. అన్ని దిగుమతులూ జీరో పన్నుతో వస్తున్నందున వీటి ధరలు మన కనీస మద్దతు ధరలో సగమే ఉంటాయి. అంటే రైతు వ్యవసాయ ఖర్చులకు కూడా సమానం కావన్న మాట. కాయధాన్యాల వ్యవహారం మన కళ్లను తెరిపించకపోతే, మధ్యప్రదేశ్‌లో ఉల్లిపాయలు, వెల్లుల్లి విషయంలో ఏం జరుగుతోందో పరిశీలించండి.

2017-18లో మధ్యప్రదేశ్ పశ్చిమ ప్రాంత జిల్లా మాండసూర్‌లో రైతుల ఆగ్రహం జాతీయ పతాక శీర్షికలో చోటు చేసుకుంది. ఆగ్రహావేశాలతో మండుతున్న రైతులపై పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు రైతులు చనిపోయారు. ఉల్లిపాయల ఉత్పత్తి కేంద్రంగా ఉంటున్న మాండసూర్‌లో వాటి ధర కిలోకు రూపాయి కంటే తక్కువకు పడిపోయింది. రైతుల ఆత్మహత్యలకు జడిసిన చౌహాన్ ప్రభుత్వం నిల్వ ఉన్న ఉల్లిపాయ లన్నింటినీ కిలోకు 8 రూపాయల లెక్కన కొంటానని ప్రకటించింది. ఈ వార్త ప్రచారం కాగానే మాండసూర్‌లో పది కిలోమీటర్ల పొడవున్నా ట్రాక్టర్ ట్రాలీలు ఉల్లివంటతో బారులు తీరాయి. సుదూరంగా ఉన్న మహారాష్ట్రలోని నాసిక్ నుంచి కూడా రైతులు తమ ఉల్లిపాయ పంటను ఇక్కడికి తీసుకొచ్చారు.

ఆ ధర వద్ద కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి దానితో ఏం చేయాలో తోచలేదు. ప్రభుత్వానికి నిల్వ సౌకర్యాలు లేవు. వర్షాలు కుమ్మరించాయి. దీంతో భారీ నిల్వను వదిలించుకోవడానికి కిలో 2 రూపాయలకు అమ్ముతానని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ఉన్మాదం కారణంగా మధ్యప్రదేశ్‌లో పన్ను చెల్లింపుదారులు రూ.785 కోట్లు నష్టపోయారు. ఇలా నష్టపోయే జాబితాలో ఈ ఏడు వంతు వెల్లుల్లికి దక్కింది. కిలో వెల్లుల్లి ఉత్పత్తికి రైతుకు రూ.15-20 ఖర్చు అవుతుండగా ధరలు మాత్రం కిలో రూ.7కి పడిపోయాయి. మనది ఎంత విచిత్రమైన దేశం అంటే, మన రైతులు పండించిన వెల్లుల్లి ధరలు కుప్పగూలిపోతాయి. అదే సమయంలో చైనా నుంచి భారీగా దిగుమతులు వస్తుంటాయి. ఎందుకంటే మన ప్రభుత్వ మెదడులో సగం వ్యవసాయం వైపు చూస్తుంటుంది. మిగతా సగం వినియోగ దారు ధరలకేసి చూస్తుంటుంది. కానీ వీరు ఇద్దరూ ఎన్నడూ పరస్పరం చర్చించు కోరు.

ఎన్నికల మధ్యప్రదేశ్ నుంచి నేర్వవలసిన పాఠం ఏమిటి? రైతులు తమ ఉత్పత్తిని పెంచేలా ఏర్పాట్లు చేసినందుకు మన రాజకీయ నేతలకు అప్పనంగా ఓట్లు పడవు. కాస్త మంచిగా ఆలోచించి వ్యవసాయాన్ని మార్కెట్లతో అనుసంధానించకపోతే, దశాబ్దికాలపు అమోఘమైన వ్యవసాయాభివృద్ధి సాధించినప్పటికీ ప్రభుత్వం ఎన్నికల్లో గెలుపు సాధిస్తుందని చెప్పలేం. డబ్బు వెదజల్లడం పరిష్కారం కాదు. కనీస మద్దతు ధర పెంపు అధిక ధరలకు గ్యారంటీ ఇవ్వదు. పైగా ఆహార ధరలు పెరగాలని ఏ ప్రభుత్వమూ కోరుకోదు. ఎందుకంటే అక్కడ వినియోగదారుడు ఉన్నాడు. పప్పు, ఉల్లిపాయ, టమాటా, బంగాళదుంపల ధరలు కాస్త పెరిగితే చాలు విమర్శలతో విరుచుకుపడే మీడియా ఉండనే ఉంది.

అందుకే ఈరోజు నిజమైన, చురుకైన రాజకీయనేత వ్యవసాయాన్ని మార్కెట్లతో అనుసంధానించడంపైనే దృష్టిపెడతాడు. దీనిపైనే వనరులను వెచ్చిస్తాడు. అవేమిటంటే ఫుడ్ ప్రాసెసింగ్, రిటైల్ చైన్లు, ప్రైవేట్ రంగం ద్వారా స్టోరేజ్, ఫ్యూచర్ మార్కెట్లను తెరవడం. ప్రభుత్వ వ్యతిరేకత లేక భావజాలం కంటే మధ్యప్రదేశ్ గోడలపై ఇవ్వాళ స్పష్టంగా వ్యక్తమవుతున్న సందేశం ఇదే మరి. ✧

# పౌరసేవల్లో జాప్యం, లంచం ఉంటే బంగారు తెలంగాణ రానట్లే!

## రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి కలిసిరండి: జేపీ

తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో సాంకేతికత అభివృద్ధి చెందుతున్నా అవినీతి తగ్గడం లేదని, కొత్తరూపు దాలుస్తూ ప్రజాస్వామ్యాన్ని, ప్రజల ఎదిగే అవకాశాలను దెబ్బతీస్తోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హెచ్చరించారు. తాను వివిధ సమావేశాలలో 250 మంది దాకా హైకోర్టు న్యాయమూర్తులతో మాట్లాడినప్పుడు.. తామెవరో చెప్పకుండా, లంచం, సిఫారసు, జాప్యం, వేధింపులు లేకుండా ప్రభుత్వ కార్యాలయంలో పనిచేయించుకోగలమని ఒక్కరంటే ఒక్కరు కూడా చెప్పలేకపోయారన్నారు. దేశంలో 65 శాతం మంది లంచం ఇచ్చే పనిచేయించుకుంటున్నారన్నారు. అవినీతిరహిత పాలన కావాలంటే రాష్ట్రంలో బలమైన లోకాయుక్త కావాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం లోకాయుక్తను ఉత్సవ విగ్రహంలా చేయకుండా, అధికారాలనిచ్చి బలోపేతం చేయకపోతే.. ప్రజలు కోరుకున్న తెలంగాణ ఏర్పడటంలేదనే భావించాల్సి ఉంటుందన్నారు. అవినీతి అంతానికి బలమైన లోకాయుక్తను సాధించేందుకు వివిధ స్వచ్ఛంద సంస్థలతో కలిసి లోక్‌సత్తా ఉద్యమం చేస్తుందని ప్రకటించారు. ఈ పోరాటంలో ప్రజలు, ముఖ్యంగా యువత కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు.

వరంగల్ అర్బన్ హనుమకొండలో లోక్‌సత్తా ఏర్పాటు చేసిన సమావేశంలో.. లోక్‌సత్తా ఉద్యమసంస్థ తెలంగాణ రాష్ట్ర సలహాదారు పర్చ కోదండరామారావు, అవినీతి వ్యతిరేక ఉద్యమసంస్థ 'జ్వాల' వ్యవస్థాపకుడు సుంకరి ప్రశాంత్, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ రామానుజరావు, ఇతర నాయకులతో కలిసి జేపీ మాట్లాడారు.

జాతీయ స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త సక్రమంగా లేకపోవటం వల్ల అవినీతి పెచ్చరిల్లుతున్నా పాలకులు పట్టించుకోకుండా ప్రగల్భాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని జేపీ విమర్శించారు. మెజారిటీ ప్రజల్లో తగినంత అవగాహన లేకపోవటాన్ని అలుసుగా తీసుకుని తప్పుడు చట్టాల్ని తెస్తున్నారన్నారు. ప్రభుత్వ కార్యాలయంలో హక్కుగా అందాల్సిన సేవలకు గతిలేక వందో, యాభయ్యో లంచం ఇచ్చే పౌరులకు తక్కువలో తక్కువగా 3 ఏళ్లు, గరిష్టంగా 7 ఏళ్లు జైలుశిక్ష విధించేలా, లంచం తీసుకున్న అధికారి మీద మాత్రం విచారణకు కూడా పైనుంచి అనుమతి తీసుకునేలా దారుణమైన సవరణల్ని అవినీతి వ్యతిరేక చట్టానికి



పార్లమెంటులో చేశారన్నారు. అన్ని పార్టీలూ ఈ దిక్కుమాలిన చట్టసవరణకు మద్దతిచ్చాయన్నారు.

లంచం అడిగిన చిలుపూరు ఆలయ ఈ.వో జయశంకర్‌ను ఏసీబీకి పట్టించిన వైద్య రమేష్‌ను నగదు పురస్కారంతో జేపీ సన్మానించారు. ఇలాంటి పోరాటాలు చేయటం అంత తేలికకాదని, రోడ్ల మీద, ప్రభుత్వ కార్యాలయాల్లోనూ కొంతకాలంపాటు చాలా సమస్యల్ని ఎదుర్కోవలసి ఉంటుందని, విజిల్ బ్లోయర్లని, జ్వాల సంస్థని, ఆరేపల్లికి చెందిన దాత సుంచు ప్రజాపతిని అభినందించారు. ఇది ఏ ఒక్కరి పనో కాదని, అందరూ కలిసి చేస్తే తేలిగ్గా పరిష్కారమవుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు హక్కుగా పనులు జరిగేందుకు 'పౌర సేవల' చట్టాన్ని తేవాలని, దీనివల్ల ప్రతి పనికీ నిర్ణీత గడువు, ఆలోగా చేయకపోతే రోజుకు రూ.200 వరకు పరిహారం ఉంటాయన్నారు. పౌర సేవల చట్టం, బలమైన లోకాయుక్తతో ప్రజలకు రోజువారీ అవినీతి నుంచి చాలావరకు విముక్తి లభిస్తుందన్నారు.

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు గల్లంతయ్యాయని సీఈవో క్షమాపణ చెప్పి దులిపేసుకోవటాన్ని జేపీ ఆక్షేపించారు. ఓటర్ల నమోదుకు పోస్టాఫీసును శాశ్వత నోడల్ ఏజెన్సీగా ఇప్పటికైనా చేయాలన్నారు. పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, సొంత ఎస్టేట్‌లులా, వంశపారంపర్య ఆస్తిలా కాకుండా సమర్థులు, నిజాయతీపరులైన యువత, సామాన్య ప్రజలు సేవ చేయటానికి వేదికలుగా రూపొందాలన్నారు. దవాఖానాల్లో నాణ్యమైన వైద్యసేవలకు అందించే ఎన్ఏబీహెచ్ గుర్తింపు ధృవీకరణ పత్రాన్ని ఈ సందర్భంగా హనుమకొండలోని కళ్యాణి ఆస్పత్రికి జేపీ అందజేశారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అంజనీదేవి, డాక్టర్లు వినూత్న, సుధాకర్, సంతన్, సౌమ్య, కీర్తి, తదితరులు పాల్గొన్నారు. ✧

# 'గణతంత్రం'లో ఆదివాసీ స్ఫూర్తి

**- ఏబీకే ప్రసాద్,** సీనియర్ సంపాదకులు

*ఓటర్ల జాబితా నుంచి వేలాదిమంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఇలా ఓటర్ల పేర్లను గల్లంతు చేసినందున నిజాయితీగా ఎన్నికలు జరపడానికి రాష్ట్రం (తెలంగాణ) స్థిరంగా లేని సమయంలో ఎన్నికలొచ్చాయి. ఈ పరిణామానికి ప్రధాన ఎన్నికల అధికారి క్షమాపణ చెప్పుకోవాలి"*

*- ఇందుకు కారకులైన రాజకీయ శక్తుల్ని పేర్కొనకుండా కాంగ్రెస్ నాయకుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన ప్రకటన (08-12-2018)*

*'నేను ఓటేయకపోతే నేను చచ్చిపోయినట్లుగా భావిస్తారు. అందుకే గత నలభై ఏళ్లుగా వోటు వేస్తున్నాను' అని అవిభక్త ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ, ఆదివాసీయేతర గిరిజన మండలాలకు చెందిన ఆదివాసీ రాజగోండ్ ఓటరు కుడిమేత భీంబాయి చెప్పింది- కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మారుమూల ఉన్న మేటి గూడ గ్రామవాసి. అలాగే ఇదే జిల్లాకు చెందిన గడిగూడ నార్నూర్ మండలాల్లో మొత్తం 31,317 మంది ఓటర్లలో 29,317 మంది (రాష్ట్రంలోనే 94.27 శాతం మంది) వోట్లు వేశారు. కాగా, ఖానామార్, ఇంద్రవెల్లి గిరిజన ప్రాంతాల్లో 71.41 శాతం మంది వోటింగ్‌లో పాల్గొన్నారు. పోల్ అయిన ఓట్ల శాతం పెరగడానికి గిరిజన ఆదివాసీల ప్రజాస్వామ్య భావన కారణమైంది'*

*- "ది హిందు", 09-12-2018*

తెలంగాణ అసెంబ్లీకి అర్థంతరంగా 9 మాసాలు ముందే జరిగిన ఎన్నికల్లో ఫలితాలు ప్రకటించకముందు పోటీలో ఉన్న నాలుగు ప్రధాన రాజకీయ పార్టీలు నిలబెట్టిన అభ్యర్థుల్లో 181 మంది నేరస్థులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులు వీరిపైన అయిదేళ్లకుపైగా నానుతూనే ఉన్నాయి. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుగానీ క్రిమినల్ కేసుల గురించి పదేపదే హెచ్చరిస్తూ ఉండే కేంద్ర రాష్ట్ర ఎన్నికల కమిషన్లుగానీ ఏళ్లో పూళ్లోగా స్పష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. పైగా కొన్ని అసెంబ్లీల (ఆంధ్ర-తెలంగాణ శాసనసభల) స్పీకర్లు సైతం అధికార, ప్రతిపక్షాల మధ్య స్వేచ్ఛగా జరుగుతూండే ఫిరాయింపుదార్లపైనగానీ ఉన్న చట్టాలను గౌరవించి చర్యలు తీసుకోవడం లేదు!

### ఓటు విలువకు పట్టం కట్టిన సంస్కృతి

ఈ దారుణ పరిస్థితుల్లో 70 ఏళ్లకు పైగా కొట్టుమిట్టాడుతున్న ధనిక (పెట్టుబడిదారీ) వ్యవస్థలో సైతం ప్రజాస్వామ్య విలువల్ని కాపాడి రక్షించగల మూలవాసులైన గణతంత్ర ఆదివాసీ గిరిజన సంస్కృతి మిణుకుమిణుకుమంటూ రాష్ట్రంలో సుదూరంగా కొండకోనల్లో మనగలుగుతూండటం ఒక మరవరాని ఆనవాలు కాదా? అది ప్రాచీన గణతంత్ర వ్యవస్థ కాబట్టే ఇంకా మన మైదాన ప్రాంతాల దోపిడీ వ్యవస్థా సంస్కృతికి భిన్నంగా-



బనర్‌గొంది నుంచి కాప్రికి ఓటు వేయడానికి వెళుతున్న గిరిజనులు



ప్రజాస్వామ్య విలువలకు ఒక ప్రతీకగా ఆదివాసీ గిరిజన జనాభాలో నూటికి 94 మందికి పైగా తమ ఓటు విలువను కాపాడుకోగలిగారు! కటిక దారిద్ర్యంలో కాలం గడుపుతున్నప్పటికీ ప్రయివేటు ఆస్తులకు కోటికి పడగలెత్తని

వారిని గురించి దక్షిణాఫ్రికా గాంధీగా ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దక్షిణాఫ్రికా విమోచన ప్రదాత నెల్సన్ మండేలా అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తుకొస్తున్నాయి. "బానిసత్వంలా, జాతి వివక్షలాగా దారిద్ర్యం అనేది ఆకస్మికంగా రుద్దబడే ఘటన కాదు - దారిద్ర్యాన్ని సృష్టించేది మానవుడే. దాన్ని నిర్మూలించడం అనేది మానవమాత్రుల నిశ్చయాత్మకమూ, నిర్మాణాత్మకమైన చర్యల ద్వారానే సాధ్యం, సుసాధ్యం" అన్నాడు.

కనుకనే ఈ రాష్ట్ర లేదా దేశవ్యాపిత ఎన్నికలనే కాదు, ధనికవర్గ వ్యవస్థ జనాభాలోని కొద్దిమంది లేదా కొన్ని సంపన్నవర్గాల ప్రత్యేక ప్రయోజనాలకు ఎప్పుడు రక్షణ కవచంగా నిలబడుతుందో, అప్పుడు బీఆర్ అంబేద్కర్ లాంటి రాజ్యాంగ నిర్ణేతలు రూపొందించిన సెక్యులర్ రాజ్యాంగమూ, దాని విలువలూ ఆచరణలో ప్రజా బాహుళ్యానికి దూరమైపోతూ ఉంటాయి. మన దేశంలో కాంగ్రెస్-బీజేపీ పాలకవర్గాల మూలంగా రాజ్యాంగ విలువలు దఫదఫాలుగా పతనమవుతూ, వీలును బట్టి ఆ పరిమిత లౌకిక రాజ్యాంగ స్వచ్ఛత కూడా రానురాను మసకబారిపోయి, ప్రజాప్రయోజనాలకు హానికరంగా మారుతోంది. ఇప్పుడు రాజ్యాంగాన్నే మార్చేసి ఏనాడూ 'హిందూ రాజ్య' భావనను ప్రతిపాదించని వైదిక నీతిని వదిలేసి, 'హిందు' పదమే 'సింధు' పదానికి అపభ్రంశమని చెప్పి, మనది సర్వమత సమ్మేళనను ప్రబోధించి 'సర్వజనులు సుఖశాంతులతో' వర్ధిల్లాలి (సర్వేజన్నా సుఖినోభవంతు) అని, 'ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే సకల భావధార'ను ఆహ్వానించాలని బోధించిన పూర్వ వైదిక ధర్మం మాత్రమే మనదనీ చాటిన ఆదిశంకరుల నీతిని సహితం పక్కకు తోసిపుచ్చుతున్నాయి బీజేపీ-ఆరెస్సెస్ వర్గాలు.

ఈ దశలో ప్రధానంగా కాంగ్రెస్-బీజేపీల పాలనాకాలంలోనే 1580 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు క్రిమినల్ నేరారోపణలను తీవ్రస్థాయిలో ఎదుర్కొనవలసి వచ్చిందని మరవరాదు. అయినా అత్యున్నత న్యాయస్థానం, అనేక ప్రజా ప్రయోజనాల రక్షణకు వీలైన ఎన్నికల చట్ట నిబంధనలను, అవినీతి నిర్మూలనకు ఉద్దేశించిన చట్టాలనూ తీవ్ర నేరారోపణలున్న లెజిస్లేటర్లపైన (అభ్యర్థులపైన) ఎన్నికల్లో పోటీ చేయకుండా రాజకీయ అనర్హులుగా ప్రకటించడానికి ఆరోపణలను వాడరాదని చెప్పడం (ఇండియాటుడే: 25-9-2018) ఎంతవరకు సమంజసమో చర్చనీయాంశం కావాలి. ప్రస్తుత లోక్‌సభలో క్రిమినల్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీలు 35 శాతం ఉన్నారని సాధికార ఏడీఆర్ నివేదిక పేర్కొన్నప్పుడు కూడా సుప్రీం చర్యకు దిగకపోవడం, ఆ పనిని పార్లమెంట్ నిర్ణయానికి వదిలిపెట్టడం సబబా? బ్రూట్ మెజారిటీ పేరుతోనో లేదా రాజకీయ స్వార్థ ప్రయోజనాలతో కూడిన రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు న్యాయస్థానం సహృదయంతో చేసిన ప్రతిపాదనకు ఎంతవరకు వీలు ఉంటుంది? ఆలోచించాలి. దీనికితోడు కుల వ్యవస్థను, అసమానతల సమాజాన్ని దేశంలో పెంచి పోషిస్తున్న పాలకులు కుల, మత, వర్గ వివక్షకు తావులేని సామాజిక వ్యవస్థ స్థాపనకు కనీస ప్రజాస్వామ్య విలువలను కూడా కాపాడలేని దుర్గతికి చేరుకున్నారు.

## నేరమయ రాజకీయాలు, నేరారోపణలు

చివరికి దేశ పాలకులు కొందరు ఓటింగ్ మిషన్ల లోపాలను సరిచేయకుండానే వాడకంలోకి పెట్టి వాటంగా వాడుకోజూస్తున్న ఘటనలు ఎన్నో ప్రచారంలో 'వైరల్' అవుతున్నాయి. వేలు, లక్షల సంఖ్యలోనే పలుచోట్ల ఓటర్లు తమకు ఫోటో-ఓటర్ చీటీలు అందలేదని, ఓటర్లయినా 'స్లిప్స్' లేకపోయినా, ఆధార్ కార్డులున్న వారిని కూడా పోలింగ్ బూత్ నుంచి వెనక్కి తిప్పి పంపించేస్తున్న ఫిర్యాదులూ లక్షల్లోనే ఉంటున్నాయి. అసలు తాము ఓటు వేసే పోలింగ్ బూత్స్ ఉన్న ప్రాంతాలు స్పష్టంగా తెలియక పలు బూత్స్ తిరిగినా ఎక్కడా తమ పేర్లు కనిపించకపోయేసరికి హతాశులై వెనక్కి మళ్లిన వారి సంఖ్య కూడా అసంఖ్యాకంగా నమోదైంది. వీరిలో సరైన వయస్సులో వారే కారు, వృద్ధులు కూడా ఉన్నారు. పలుచోట్ల ఈవీఎంలు, ఓటర్ ఓటు వేసిన తర్వాత అది నమోదైన తీరును చూసుకునే అవకాశమివ్వాల్సిన వివిపాట్స్ యంత్రాలు అనేకచోట్ల మొరాయించి 2-3 గంటలపాటు పనిచేయపోవడంతో ఓటర్లు తమ ఓటు వినియోగించుకోకుండానే వెనుదిరిగిపోయారు. కొన్ని చోట్లయితే అసలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా మార్చేయడంతో ఓటర్లు అయోమయంలో పడ్డారు. ఇదీ మన ప్రజాస్వామ్యపు 'మేడిపండు' గాథ. కనుకనే చూసి, చూసి ఆ అధర్మ, అరాచక వ్యవస్థను కొంతవరకైనా గాడిలో పెట్టే సదుద్దేశంతోనే సుప్రీం ధర్మాసనం ఓటింగ్ సరళిని 'ప్రజాస్వామికం' చేసేందుకు పార్టీలు, అభ్యర్థులు వారి ఓటు గుర్తులున్న జాబితాలో 'పై అభ్యర్థులెవరూ మాకిష్టం లేదు' (నన్ ఆఫ్ ది ఎబౌ - నోటా) అన్న ఇంటూ సింబల్‌ను కూడా ఆఖర్లో చేర్చారు.

## ప్రజాస్వామ్యమా? 'వంచనా'స్వామ్యమా?

ఇటీవల కొంతకాలంగా ఈ 'నోటా'కు ఓటు వేసే వారి

సంఖ్య డజన్ల స్థాయి నుంచి, వందలకు, ఆపైన వేలకు, ఇటీవల కాలంలో లక్షల సంఖ్యలోకి పెరుగుతోందని పత్రికల సమాచారం. ఇటీవల కొన్ని ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల్లోనూ, ఉప ఎన్నికల్లోనూ 'నోటా' ఓటర్ల సంఖ్య పెరగడాన్ని పత్రికలు నమోదు చేశాయి. అంటే, ప్రజాస్వామిక భావాలకు, పౌర సమాజ సభ్యుల భావ ప్రకటనా స్వేచ్ఛకూ పాలకుల నుంచి రోజురోజుకు ఎదురవుతున్న ఆంక్షలకు, బెదిరింపులకు సమాధానంగా ఒక ప్రజాస్వామిక నిరసనగా ఈ 'నోటా' విలువ పరిమితమైనది. కానీ మౌలిక ప్రజాస్వామిక సంప్రదాయానికి, గణతంత్ర వ్యవస్థ సంప్రదాయానికి అలవాటుపడి ఇప్పటికీ ఆ ప్రజాస్వామిక సంప్రదాయం ప్రకారం తమ ఎంపికను స్వేచ్ఛగా ప్రకటించడానికి ఏ రోడ్డు రవాణా, వాహన సౌకర్యాలు లేని ఆదివాసి గిరిజనులు 12 నుంచి 16 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి ఓటింగ్‌లో పాల్గనడం... ఆధునికమని చెప్పుకునే మన నేటి స్వార్థపూరిత ధనికవర్గ సమాజంలో మనందరికీ ఒక చెంపపెట్టు. కాగా, శ్రీశ్రీ అన్నట్టుగా 'నేటి రివల్యూషనరీ రేపటి రియాక్షనరీ' అయితే ఎలా ఉంటుందో ప్రజాయుద్ధ నౌక, దళిత కవి గద్దర్ మనకు నమూనాలా కనిపిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం గద్దర్ ఏ చంద్రబాబు తుపాకీ గుండు దెబ్బతిన్నాడో అదే చంద్రబాబు నేడు ఆ గద్దర్ దృష్టిలో 'ప్రజాస్వామ్య రక్షకుడి'గా కన్పించడం సృష్టిలోపమా, దృష్టిలోపమా, మనకు తెలియదు. అందుకే దేశంలో నేడున్నది ప్రజాస్వామ్యమా? లేక ఆ పేరుతో ప్రబోధాలతో ప్రజాశక్తుల్ని దశలవారీగా లొంగదీసుకోవడానికి వేగంగా ప్రయత్నిస్తున్న వంచనాస్వామ్యమా అన్నది శేష ప్రశ్న. ✧

(కర్టెసీ: సాక్షి)

# మినీ గోకులంలో రాజకీయాలెందుకు?



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ రైతులకు అమలు చేస్తున్న 'మినీ గోకులం' పథకంలో రాజకీయాల వల్ల అర్హులైన రైతులు నష్టపోతున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. దీనిపై పార్టీ నేతలతో కలిసి విజయనగరంలో పశుసంవర్థక శాఖ ఉప సంచాలకుడు పైడి శ్రీనివాసరావును కలిసి వివరించారు. పేద రైతుల కోసం మూడు పద్ధతుల్లో రూ.120 కోట్లతో మినీ గోకులాల్ని ఏర్పాటు చేయాలని నిర్దేశించారని, కానీ తెలుగుదేశం ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు ఉన్నచోట అర్హులకు కాకుండా తమ తాబేదార్లకు వాటిని కట్టబెడుతున్నారన్నారు. పార్టీ ప్రయోజనాల కోసం పేద రైతులను దెబ్బతీయటం దారుణమన్నారు. ప్రభుత్వం ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారులను నియమించినందున పార్టీలకతీతంగా పశువుల షెడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివరాల్ని కలెక్టర్‌కి అందజేస్తానని ఉప సంచాలకుడు చెప్పినట్టు బాబ్జీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీ నేతలు తాట్రాజు రాజారావు, లెంక లక్ష్మణరావు, తాట్రాజు పెంటబాబు, చందక ఆనంద్ పాల్గొన్నారు.




"ఒక వ్యక్తి వల్ల సమాజానికి ఎంత మేలు జరుగుతుందన్నదే ఆ వ్యక్తి గొప్పతనానికి గీటురాయి"

– మహాత్మాగాంధీ

# తెలంగాణ అనుభవం తర్వాతైనా ప్రచారాన్ని తగ్గించి పాలన మీద దృష్టి పెట్టండి

"చంద్రబాబు గారూ! మీ మితిమీరిన ప్రచారాన్ని ఆపండి. విషయంలేని మీ సొంతడబ్బా ప్రసంగాలు వినీవినీ జనానికి చెవుల్లో నుంచి రక్తం కారుతోందని జోకులు పేలుతున్నాయి. తెలంగాణలో వైఫల్యం చూశాకైనా మీ ధోరణి మార్చుకోండి. పరిపాలన మీద దృష్టి పెట్టండి. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని పోగొట్టి, మంచి చదువు, ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలతో ప్రజలను మెప్పించగలిగితే.. మితిమీరిన ప్రచారం లేకుండానే ప్రత్యర్థుల మీద తేలిగ్గా నెగ్గగలుగుతారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రత్యామ్నాయ ఎజెండా ఉంటేనే జాతీయ స్థాయిలోనైనా ప్రభావం చూపగలుగుతారు" అని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రత్యేకహోదా, ఇతర విభజన హామీల విషయంలో పార్టీలు, ప్రభుత్వాలు చేసిన తప్పులకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారని, వీటిని సరిచేసేందుకు ఇప్పటికైనా చంద్రబాబు చొరవ చూపాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రాలకి మరిన్ని అధికారాలు కావాలని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్ చేస్తున్న ప్రయత్నాలకి తమ మద్దతు ఉంటుందని, అలాగే రాష్ట్రం నుంచి




మునిసిపాలిటీలు, పంచాయతీలకు కూడా మరిన్ని అధికారాలు, నిధులు కావాలని లోక్‌సత్తా డిమాండ్ చేస్తోందని ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఈ రకమైనా సంస్కరణలు లేకుండా.. ఎన్ని తాయిలాలిచ్చినా, పథకాల్ని ప్రవేశపెట్టినా వృద్ధి సాధ్యం కాదని, పార్టీలు వచ్చే ఎన్నికల్లోనైనా తమ ఎజెండాను మార్చుకోవాలని బాబ్జీ కోరారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు నాగభూషణం, చిన్నారావు (నాయుడు), రాజారావు, రాజు, చంద్రరావు, లక్ష్మణరావు, చిన్నారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'ఇస్రో' శాస్త్రవేత్తల విజయాలపై చర్చ జరగాలి

మనదేశంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కార్యాలయాల నుంచి పంచాయతీ ఆఫీసులో ఉద్యోగి వరకూ యంత్రాంగం పేలవంగా, నత్తనడకన పనిచేస్తూ తరచూ విఫలమవుతుంటే.. మన 'ఇస్రో' శాస్త్రవేత్తలు మాత్రం ప్రపంచాన్నే అబ్బురపరిచే విజయాల్ని సాధిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ యువసత్తా విజయనగరం అధ్యక్షుడు రొక్కం గురునాథం అన్నారు. దీనిపై చర్చ జరగాలన్నారు. ఇస్రోకు స్వతంత్ర ప్రతిపత్తి, జవాబుదారీతనంతో తగినన్ని నిధులు ఇస్తుండటం వల్లే ఈ అద్భుతాలు సాధ్యమవుతున్నాయన్నారు. ఇదేరీతిన ఇతర ప్రభుత్వ సంస్థలకు, మన స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని, స్వతంత్ర ప్రతిపత్తిని ఇస్తే గొప్ప మార్పుల్ని చేసి చూపిస్తాయన్నారు. పట్టణంలోని శ్రీ సాయి గాయత్రి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన 'మన దేశం – శాస్త్రవేత్తల ఘనవిజయం'పై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంల ప్రదర్శిస్తున్న ఉత్సాహాన్ని పాలకులు పాలనలోనూ చూపాలని గురునాథం అన్నారు.




ప్రజలలో ఛాందస భావాలను కాకుండా శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేందుకు, పరిశోధకుల సంఖ్యను పెంచేందుకు పెద్దఎత్తున చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన చదువు, జవాబుదారీతనంతో అధికార వికేంద్రీకరణలతోనే భారతదేశంలో మనందరం కలలుగంటున్న పెద్దమార్పులు సాధ్యమవుతాయన్నారు. యువసత్తా ప్రతినిధులు లక్ష్మణ్, పీఎల్ఎన్ రాజు, చింతల శివకుమార్, ప్రిన్సిపాల్ కె. మహేశ్వరరావు, రమేష్ నాయుడు, రాజు, రామారావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


# 2019 ఎన్నికల్లోనైనా 'మార్పు'కి ఉపయోగించుకోండి

## -అయిదేళ్ల దార్శనిక పత్రాన్ని అందించిన ఆర్థిక దిగ్గజాలు-

దేశం ఏదోకస్థాయి వృద్ధి చెందుతున్నా అన్ని రంగాలు, ప్రజలకు దీనివల్ల ఒరిగేదేమీ ఉండటం లేదని ప్రసిద్ధ ఆర్థికవేత్తలు అభిప్రాయపడ్డారు. నిరుద్యోగాన్ని తొలగించేలా ఉద్యోగాల సృష్టికి ప్రస్తుత వృద్ధి ఊతమివ్వటం లేదన్నారు. 90,000 రైల్వే ఉద్యోగాలకు 2,50,00,000 మంది దరఖాస్తు చేశారంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. అవి కూడా తక్కువ స్థాయి ఉద్యోగాలని గుర్తుచేశారు. గత అయిదేళ్లలో ఆర్థికస్థితి మెరుగవ్వలేదని స్పష్టంచేశారు. దేశీయంగా అంతకంతకూ అధికమవుతున్న ఆర్థిక సవాళ్లను పరిష్కరించాలంటే, రాబోయే అయిదేళ్లకు ముందస్తు ప్రణాళిక అవసరమన్నారు.

2019 సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్, అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) ముఖ్య ఆర్థికవేత్తగా నియమితులైన హార్వర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ గీతా గోపీనాథ్ సహా 13 మంది ఆర్థికవేత్తలు భారత్‌కు ఏమి అవసరమో వివరిస్తూ, ఆర్థిక దార్శనిక పత్రాన్ని రూపొందించారు. దేశానికి ఏమి అవసరమో తాము సమాచారం ఇస్తున్నామని, రాజకీయ పార్టీలు వీటిని వినియోగించుకుని పరిష్కారానికి తమదైన ప్రణాళికలు రూపొందిచుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యావరణం, మౌలిక సదుపాయాలు, విదేశీ వ్యవహారాలు, వ్యవసాయం, ఇంధనం, భూ సంస్కరణలు, పేదరిక నిర్మూలన పథకాలు, ఆర్థిక రంగం, అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ, బ్యాకింగ్ రంగాలపై ఆర్థికవేత్తలపై ఇచ్చిన సూచనలు కొన్ని:

- విద్యను పొందటం ప్రాథమిక హక్కుగా చేయాలన్న ఆశయం పూర్తిగా విఫలమైంది. కావాల్సింది ఎంపిక చేసుకునేందుకు మాత్రమే భారత విద్యారంగం పరిమితమవుతోంది కానీ, మానవ అభివృద్ధికి ఉపయోగపడటం లేదు. అందువల్ల దీన్ని వడపోతగా మాత్రమే పేర్కొనవచ్చు.




- ఉద్యోగాల కల్పన పెద్దఎత్తున జరగాల్సి ఉంది.
- రైతు రుణమాఫీలు ఎన్నికల వాగ్దానం కాకుండా చూడాల్సిన బాధ్యతను ఎన్నికల సంఘం తీసుకోవాలి. గత అయిదేళ్లలో ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో ఏదోక పార్టీ రుణమాఫీ హామీ ఇస్తోంది. రుణమాఫీల వల్ల పొలాలపై పెట్టుబడులు తగ్గిపోతాయి. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం పడుతోంది. రుణమాఫీల వల్ల కొందరు రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోందని గుర్తించాలి. తీసుకున్న రుణాన్ని సకాలంలో తీర్చేద్దామనే ఆలోచనకు ఇవి గండికొడుతున్నాయి. సాగు కష్టాల పరిష్కారానికి ప్రత్యామ్నాయాలు ఆలోచించాలి.
- ఇప్పటికే నగరాలలో వాతావరణం పూర్తిగా కలుషితమైంది. ప్రస్తుత వృద్ధి రేటుకు రెట్టింపు సాధించాలనుకుంటే, నగరాలు మరెంత విషపూరితం అవుతాయో! పర్యావరణ పరిరక్షణపై అధికంగా పనిచేయాల్సి ఉంది. సామర్థ్యాలను పెంచుకుంటూనే, ప్రపంచ పౌరులుగా ప్రవర్తించాలి. వాతావరణ మార్పులను అరికట్టేందుకు ముందు నడవాలి.
- ప్రభుత్వరంగ బ్యాంకు (పీఎస్‌బీ)లపై దీర్ఘకాల ప్రభావం చూపే ఆదేశాలను కేంద్రప్రభుత్వం ఇస్తోంది కానీ, వాటి వల్ల పడే ఆర్థికభారానికి పరిహారం ఇవ్వడం లేదు. ఏదైనా పథకం వల్ల ఉపయోగం ఉంటుందని భావిస్తే, దానికి బడ్జెట్ నుంచే నిధులు కేటాయించాలి. అన్ని బ్యాంకులు

అమలు చేసేలా చూడాలి. రుణ లక్ష్యాలు తప్పనిసరిగా చేయాలనే ఆదేశాలు పీఎస్‌బీలకు ప్రమాదకరం. లక్ష్యాలు సాధించేందుకు, తగినంత పరిశీలన చేయకుండా/జాగ్రత్తలు తీసుకోకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నాయి. ఇందువల్ల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) మరింత పెరిగే ప్రమాదముంది. ఈ సమస్యలన్నీ పీఎస్‌బీల ప్రైవేటీకరణ వల్లే తీరవు. ప్రభుత్వ పథకాలను బ్యాంక్ శాఖల ద్వారా అమలు చేయాలనుకోవడం సరికాదు. బ్యాంకులు తమ నిధులను ప్రభుత్వబాండ్లలో తప్పనిసరిగా ఉంచాల్సిన వాటానే చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (ఎన్‌ఎల్‌ఆర్)గా వ్యవహరిస్తారు. దీన్ని తగ్గించాలి. బ్యాంకుల బోర్డుల్లో వృత్తినిపుణులు పెరగాలి. రాజకీయాలు నివారించేందుకు బోర్డుల నియామకాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలి.

- బ్యాంకులు గృహనిర్మాణదారులకు నేరుగా రుణాలివ్వడం లేదు. దానికి బదులు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ)కు ఇస్తున్నాయి. అవి డెవలపర్లకు అందిస్తున్నాయి. అంటే పరోక్షంగా బ్యాంకులే నిధులిస్తున్నాయి. డెవలపర్లు తిరిగి చెల్లించకపోతే, బ్యాంకులపై భారం పడుతుంది. ఇది నివారించాలంటే, మార్కెట్ల నుంచి నేరుగా నిధులు సమీకరించే అవకాశం ఎన్‌బీఎఫ్‌సీలకు కల్పించాలి.
- ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ రివ్యూ కమిటీ 2017 జనవరిలో సూచించినట్లు ఆర్థిక మండలి నెలకొల్పాలి. రాష్ట్రాల్లో ద్రవ్యలోటు పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి. వాస్తవ ఆర్థిక వ్యవస్థ, మార్కెట్లపై ప్రభావం చూపేది ఏకీకృత ద్రవ్యలోటే. ఆర్థిక సంక్షోభం ఏర్పడినపుడు, కేంద్ర–రాష్ట్రాల్లోని సార్వభౌమ అధికారం వహించేవారే బాధ్యులు కావాలి.
- చట్టబద్ధ ద్రవ్య నిష్పత్తి (ఎస్‌ఎల్‌ఆర్)ను తగ్గించాలి. దీనివల్లే బ్యాంకులు కార్పొరేట్ బాండ్లు అధికంగా కలిగి ఉంటున్నాయి. ఎస్‌ఎల్‌ఆర్‌ను సాధ్యమైనంతగా తగ్గించేందుకు, మధ్యంతర ప్రణాళిక అవసరం. ఇందువల్ల బాండ్ మార్కెట్లలో ద్రవ్య లభ్యతకు బ్యాంకులు మరింత సన్నద్ధమవుతాయి. బ్యాంకు రుణాలు, ద్రవ్యలోటుల వల్ల ఏర్పడే ఆర్థిక వ్యవస్థ వక్రీకరణలు పరిమితం అవుతాయి. బాండ్లలో విదేశీ పెట్టుబడుల పరిమితిని పెంచాలి.

దార్శనిక పత్ర రూపకల్పనలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆచార్యుడు అభిజిత్ బెనర్జీ, హెచ్‌ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి, జేపీ మోర్గాన్ ఛేజ్ బ్యాంక్ భారత ముఖ్య ఆర్థికవేత్త సజ్జిద్ చినాయ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మైత్రీష్ ఘాతక్, యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియా ఆచార్యుడు అమర్త్య లహిరి, క్రెడిట్ సూయిజ్ భారత ఆర్థికవేత్త నిలకాంత్ మిశ్రా, హార్వార్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రిహిణీ పాండే, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ఆచార్యుడు ఇ.సోమనాధన్, గోల్డ్‌మన్ శాక్స్ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రాచీ మిశ్రా, కార్నెల్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు ఈశ్వర్ ప్రసాద్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, శాన్‌డియాగోకు చెందిన కార్తీక్ మురళీధరన్ పాలుపంచుకున్నారు. ✧

# కరవు మండలాలుగా ప్రకటించండి

వర్షాభావం వల్ల విజయనగరం జిల్లాలోని 26 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయని, వీటిపై జాప్యం లేకుండా అంచనాల్ని రూపొందించి కరవు మండలాల పరిధిలోకి తెచ్చి రైతు కుటుంబాలను ఆదుకోవాలని బాబ్జీ అన్నారు. వ్యవసాయ శాఖ జేడీ లీలావతిని కలిసి ఈ మేరకు విజ్ఞాపన అందజేశారు. జిల్లాలో దాదాపు 30 వేల హెక్టార్లకు పైగా పంట దెబ్బతిందని, ఉన్న 10,000కు పైగా చెరువుల్లో 90 శాతం నీటి చుక్క లేదని వివరించారు. ప్రభుత్వం తొలివిడతగా నాలుగు మండలాల్ని ప్రకటించిందని, కురుపాం,



గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, పూసపాటిరేగ, చీపురుపల్లి, గుర్ల, గరివిడి వంటివి తప్ప అన్ని మండలాలూ తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు.

# హ్యాపీనెస్ చిరునామా..!



ఈ లక్ష్యాన్ని సాధించాలి,

ఆ ఉద్యోగాన్ని సంపాదించాలి,

ఇంత పెద్దఎత్తున డబ్బును ఆర్జించాలి,

నా కుటుంబ సభ్యులంతా నన్ను చూసి గర్వపడాలి,

సమాజానికి అంత సేవ చేయాలి..

ఇలాంటివన్నీ మన శక్తిసామర్థ్యాలతో, నిబద్ధతతో ముడిపడిన అంశాలు! కానీ కొన్నేళ్లు గడిచాక, కొన్నిటిని సాధించాకా చూసుకుంటే.. ఇవన్నీ ఎవరి కోసమో కాకుండా మన కోసమే మనం చేసుకున్న పనులని అర్థమవుతాయి.

ఇంకొంత పరిణతిని సాధించాక చూసుకుంటే.. మన సంతోషం లేదా ఆనందం (సంతోషానికి, ఆనందానికి స్థాయిల్లో కొంతతేడా ఉందని కొందరి అభిప్రాయం. కానీ ప్రస్తుతానికి వాటిని పర్యాయపదాలుగానే వాడదాం) కోసమే ఈ పనులన్నిటినీ మనం చేసుకున్నామని అర్థమవుతాయి.

అంటే అంతిమంగా, మనం జీవించేది సంతోషం లేదా ఆనందం కోసమేనని గుర్తిస్తాం. లైఫ్‌లో సక్సెస్ కోసం అనేక మెట్లను చూపుతూ, బోలెడన్ని టిప్స్ ఇచ్చిన ఓ రచయిత.. తన తరువాతి దశ రచనల్లో– విజయాన్ని పంచుకోవటమే గొప్ప విజయమని ఎందుకు చెప్పారో, విజయాన్ని పంచుకుంటే లభించే సంతృప్తి, సంతోషాలను గొప్ప విజయాలుగా ఎందుకు అభివర్ణించారో తేటతెల్లంగా అర్థం చేసుకుంటాం.

ఈ దశకు చేరుకున్నాక..

ఆనందో బ్రహ్మ

చిదానందం

సచ్చిదానందం

ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫరెవర్

సంతోషం సగం బలం

.. వంటి మాటల సారాంశం కూడా పూర్తిగా స్పష్టమవుతుంది.

మనం చేసే ఏ పనైనా చివరికి మన 'ఆనందం' కోసమే అనే స్పష్టత సమాజంలో ఏదోక స్థాయిలో, ఏదోక రూపంలో పెరుగుతున్నకొద్దీ.. దాన్నే సామూహిక లక్ష్యంగా మార్చి జీవన సంస్కృతిలో భాగం చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి.

విస్తృత ప్రజల జీవనంలో ఏదైనా అంశం అంతర్భాగం కావాలంటే.. అది రాజకీయంలో భాగం కావాలి. ప్రజల ఆనందం కోసం రాజులు పనిచేయాలని బౌద్ధధర్మ ప్రభావంతో పాలించిన అశోక చక్రవర్తి నమ్మేవాడని చెబుతుంటారు. ఆ రీతి.. ఇంకొందరి చక్రవర్తుల పాలనలోనూ కన్పించొచ్చు. కానీ ఆధునిక కాలంలో 'ఆనందాన్ని' రాజకీయంలో భాగం చేసే ప్రయత్నాన్ని తొలుత భూటాన్ చేసింది.

'స్థూల జాతీయోత్పత్తి కన్నా స్థూల ఆనంద సూచిక ప్రధానం' అని భూటాన్ రాజు జిగ్మె సింగ్యె వాంగ్‌చుక్ 1972లో బొంబయి విమానాశ్రయంలో 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. భూటాన్ రాజ్యాంగంలో.. సామాజికంగా ప్రజల ఆనందమే ప్రధాన లక్ష్యంగా నిర్వచించారు. సుస్థిర సామాజిక, ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతీ పరిరక్షణ, సమర్థవంతమైన పరిపాలన అనే కీలకాంశాల ఆధారంగా స్థూల ఆనంద సూచికను భూటాన్ ప్రభుత్వం గణిస్తుంది. ఇదంతా చూస్తూ వస్తున్న ఐక్యరాజ్యసమితి 2011లో 'స్థూల జాతీయ ఆనంద సూచిక' స్ఫూర్తితో ప్రజల ఆనందాన్ని ప్రాథమిక మానవ లక్ష్యంగా ప్రకటిస్తూ తీర్మానం చేసింది. స్థూల జాతీయ ఆనంద సూచికను సరికొత్త ఆర్థిక సూత్రంగా అభివర్ణిస్తూ భూటాన్ ప్రధాని జిగ్మె థిన్లే, ఐక్యరాజ్యసమితి నాటి ప్రధాన కార్యదర్శి బాన్‌కీ మూన్ 2012లో ఒక అత్యున్నత సమావేశాన్ని నిర్వహించారు.

**2018లో ప్రపంచ హ్యాపీనెస్ నివేదికలోని మొదటి 10 దేశాలు**

1. ఫిన్‌లాన్డ్
2. నార్వే
3. డెన్మార్క్
4. ఐస్‌లాండ్
5. స్విట్జర్లాండ్
6. నెదర్లాండ్స్
7. కెనడా
8. న్యూజిలాండ్
9. స్వీడన్
10. ఆస్ట్రేలియా

భూటాన్‌లో జరుగుతున్న అంతఃకలహాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు వంటి తీవ్ర సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకే అక్కడి ప్రభుత్వం స్థూల జాతీయ ఆనంద సూచిక గురించి మాట్లాడుతోందన్న విమర్శలు కూడా వచ్చినప్పటికీ.. ఆ కాన్సెప్ట్‌కి ఆదరణ పెరిగిందే తప్ప తగ్గలేదు. ప్రపంచ ఆనంద దినోత్సవం సందర్భంగా ఏటా ఐక్యరాజ్యసమితి విడుదల చేసే ర్యాంకింగుల పట్ల ప్రజల్లో కూడా ఆసక్తి పెరుగుతోంది. ఇక మనదేశంలో మధ్యప్రదేశ్‌లో బీజేపీ ముఖ్యమంత్రిగా పదిహేనేళ్లపాటు పాలించిన శివరాజ్‌సింగ్ చౌహాన్ మొట్టమొదటిసారిగా 'హ్యాపీనెస్ మంత్రిత్వ శాఖ'ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత విభజిత ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా హ్యాపీనెస్ శాఖను ఏర్పాటు చేసి తన అధీనంలో పెట్టుకుని పర్యవేక్షిస్తున్నారు. హ్యాపీ సండే పేరుతో సరదా కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

## దేశంలో తొలి హ్యాపీనెస్ మంత్రే ఓడిపోయారు

మధ్యప్రదేశ్‌లో 2018 సంవత్సరాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్‌తో సమానంగా 40శాతం పైగా ఓట్ షేర్ వచ్చినప్పటికీ.. గతంకంటే 13.7 శాతం ఓట్లు తగ్గాయి. మూడు తడవలు అధికారానికి దూరంగా ఉండటంతోపాటు తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పొత్తులేకుండా కాంగ్రెస్ బీజేపీని ఢీకొని సమానస్థాయి ఓట్లు సాధించింది. ఈ ఎన్నికల్లో ఏకంగా మధ్యప్రదేశ్ హ్యాపీనెస్ శాఖా మంత్రి, దేశంలో తొలి హ్యాపీనెస్ మంత్రి లాల్‌సింగ్ ఆర్య కాంగ్రెస్ అభ్యర్థి చేతిలో 25,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

ఏరకంగా చూసినా కాంగ్రెస్‌ది పైచేయి కావడంతో నైతికతకు ప్రాధాన్యమిచ్చి చౌహాన్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.

## మోదీ పాలనలోనూ తగ్గుతున్న సంతోషం

ఎంపీ నుంచి జాతీయ స్థాయికి వెళ్తే.. మోదీ ప్రభుత్వంలో హ్యాపీనెస్ మంత్రిత్వ శాఖ లేకపోయినా.. ఇండెక్స్‌ల ప్రకారం చూస్తే నానాటికీ దిగజారుతున్నట్టు

స్పష్టంగా కనిపిస్తుంది. 'ప్రపంచ ఆనంద సూచిక'లో భారతీయుల పరిస్థితి 2016లో కంటే 2017లో నాలుగు స్థానాలు దిగజారితే, 2018లో మరీ దారుణంగా 11 స్థానాలు కిందికి జారింది. మొత్తం 156 దేశాల్లో 2018లో భారత్ 133వ స్థానంలో ఉంది. అంతర్యుద్ధాలతో అతలాకుతలమైన కొన్ని దేశాలు, పొరుగున ఉన్న పలు దేశాల కన్నా కూడా మనం వెనుకబడి ఉన్నాం. సంతోష సూచీలో మన కంటే దిగువన మాల్వి, హైతి, సిరియా, టాంజానియా, బురుండి వంటి దేశాలు మాత్రమే ఉన్నాయి.

ఆనందాన్ని పాలనతో ముడిపెట్టి చూడటానికి ఐక్యరాజ్యసమితి కొన్ని ప్రాతిపదికల్ని పేర్కొంది. స్థిరమైన ఆదాయ ప్రగతి, ఆరోగ్యకరమైన జీవితం, ఆయుర్దాయం, సామాజిక సామరస్యత, అవినీతిరహిత సమాజం, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్య ధోరణులు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని సమితి ర్యాంకింగుల్ని నిర్ణయించింది.

### మన ప్రజలు ఆనందం కోరుకోవటం లేదా?

మన దేశంలో ప్రజలు ఆనందాన్ని కోరుకోవటం లేదా? లేక ప్రజలకు ఆనందాన్నిచ్చే పాలనను అందివ్వటం లేదా?.. ఎందుకు భారత్ ర్యాంకు పడిపోతోంది, మధ్యప్రదేశ్‌లో ఏకంగా హ్యాపీనెస్ మంత్రే ఓడిపోయారు, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మళ్లీ గెలవటంపై అభద్రతలో ఉన్నారు?

శివరాజ్‌సింగ్ అంటే మొహంమొత్తి

**సంతోష సూచీ (2018)లో భారత్ పొరుగుదేశాలు**

పాకిస్తాన్: 75
చైనా: 86
భూటాన్: 97
నేపాల్: 101
బంగ్లాదేశ్: 115
శ్రీలంక: 116

ప్రజలు రాహుల్‌గాంధీ పార్టీకి ఓట్లు వేయటానికి కాంగ్రెస్ పార్టీయేమీ చౌహాన్ ప్రభుత్వం కంటే సుందరవదనమైన పాలనను ఆఫర్ చేయలేదు. కానీ కొంత ఎక్కువగా తాత్కాలిక ప్రయోజనాల్ని, కొత్త ప్రలోభాలను చూపుతోంది. స్కీముల మామ శివరాజ్ కంటే రాహుల్ కాంగ్రెస్ ఏమన్నా అదనంగా ప్రయోజనం చేకూరుస్తుందేమో, ఒకసారి ఓడిస్తే శివరాజ్ కూడా మెరుగుపడతారేమో అన్నట్టుగా జనం ఓట్లు వేశారు. ముఖ్యంగా రైతులు, యువత!

ప్రజలు తమకు అందుబాటులో ఉన్న చట్రంలో తెలివిగానే ఓట్లేస్తున్నా.. వారి అశాంతి పెరుగుతోందే తప్ప తగ్గటం లేదు. మరోవైపు, బాగానే పరిపాలించాం కదా అనుకుంటున్నవాళ్లు కూడా ఓడిపోతున్నారు. ఈ ప్రశ్న ఓ పెద్ద 'పీఠ'ముడిగా తయారైంది.

అయితే మన ఎన్నికల చర్చంతా.. ఈ ముడితో సంబంధం లేకుండా ఎలా అధికారంలోకి రావాలి, అందుకోసం ఎలాంటి కాంబినేషన్లు, ఫార్ములాలు కావాలి, గుడ్డిలో మెల్లలాగా ఎవర్ని ఎన్నుకోవాలి, మన కులం, మతం, ప్రాంతం వంటి ఆటవిక ఆవేశాల్ని ఎలా ప్రదర్శించాలి, ఎలా వాడుకోవాలి అన్న వాటి చుట్టూనే జరుగుతుండటంతో మన ప్రజాస్వామ్యం, అందులోని మన బతుకులు ఒంటిపాదంతో నడుస్తున్న ధర్మదేవతలానే సాగుతున్నాయి. సర్జికల్ స్ట్రయిక్‌లు వంటి వాటిల్లో చూపే ధైర్యానికి పరిమితంకాకుండా.. దేశశక్తితో కూడిన ధైర్యాన్ని నేతలు, ఆలోచనాపరులు ప్రదర్శిస్తే, ఈ పెనుసంక్షోభానికి విస్పష్ట జవాబు గోచరిస్తుంది.

### ఆనందానికి బదులు వివశత్వం

ప్రజలు ఆనందాన్ని కోరుకుంటున్నారన్నది వాస్తవం.

కానీ వారికి ఆ ఆనందాన్ని ఇవ్వకుండా రకరకాల తాత్కాలిక పథకాలు, తాయిలాలు, ప్రలోభాలు, కులం, మతం వంటి ఉద్వేగాలను పెంచుతూ, నల్లడబ్బు పంచుతూ వివశుల్ని చేసే రాజకీయం చేస్తున్నారు. మద్యం మత్తును ఇంకాఇంకా ప్రోత్సహిస్తున్నాయి, అర్థరహిత మతవిశ్వాసాల్లో ముంచుతున్నాయి. ఏ ఆనందాన్ని ఆశించి మనిషి సమాజంతో సామాజిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాడో.. ఆ ఆనందం నెరవేరటానికి రాజకీయం, ఎన్నికలు, పాలన మార్గం కాకుండా పోతున్నాయి. ప్రజలకు ఆనందాన్ని కలిగించే పాలనను అందించటమే ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాల పని అని అభివృద్ధి చెందిన దేశాల అనుభవాలు చెబుతున్నా, మనం పట్టించుకోవటం లేదు. ప్రభుత్వాలు ఏం చేయాలో ఆ పనులు చేయకుండా.. ప్రజల్ని యాచకుల్లా, తమకు ఓటు వేసే బానిసల్లా

కొనసాగించే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రజలకు ఎంతోకొంత మంచి చేయాలని వచ్చిన నిజాయతీపరులు కూడా.. ఎన్నికల ద్వారా ఎలాగోలా అధికారం పట్ల టెంప్ట్ అయిపోయి విషవలయంలో భాగంగా మారిపోయి, అప్పుడప్పుడు అంతరాత్మ గుర్తుచేసినప్పుడు కన్నీరు కారుస్తున్నారు. వీరిలో కొందరు ధైర్యం చేద్దామనుకున్నా.. ప్రజలకు నిజమైన ఆనందాన్ని అందించే దిశలో ప్రభుత్వ బాధ్యతలను చెబుతూ ఎన్నికలకు వెళితే– ప్రత్యర్థులు తాత్కాలిక ఆకర్షణల దెబ్బకి తాము ఓడిపోతామేమోనన్న భయం పట్టి పీడిస్తోంది. దీంతో విషవలయంలో ఇంకా కూరుకుపోతున్నారు.

**ఆడలేక ప్రజాస్వామ్యం ఓడు అంటున్న పార్టీలు, నేతలు**

తాత్కాలిక, జనాకర్షక పథకాలతో ప్రజలను యాచకులుగా కొనసాగించే పాలనకు – ప్రభుత్వం చేయాల్సిన అసలైన పనులు చేస్తూ ప్రజలు స్వతంత్ర జీవనంతో ఆనందంగా బతికేలా చేసే పాలనకు మధ్య సంధి దశలాంటి ఈ వాతావరణాన్ని బ్రేక్ చేయటానికి.. అధికారమే పరమావధి అనే రాజకీయం పెద్ద అవరోధంగా మారింది. దీన్ని అధిగమించి పిల్లి మెళ్లో గంట కట్టే స్థాయి సత్తానైనా ఏదోకపార్టీ ప్రదర్శించాలి లేదా అన్ని పార్టీలూ కలిసి ఈ మౌలిక విషయాల్లో అందరం ఒకే విధానంతో కట్టుబడి వెళ్దాం అనయినా ఏకాభిప్రాయంతో రాజకీయం చేయాలి. పార్టీలన్నీ కలిసి మౌలికాంశాల్లో పరిష్కారాలతో ఏకాభిప్రాయంతో వస్తే.. ప్రజలు కూడా సానుకూలంగా స్పందిస్తారు, క్రమంగా 'నోటా' అవసరం కూడా ఉండదు. విత్తు ముందా, చెట్టు ముందా అని చర్చిస్తూ అధికార క్రీడలో భాగం కాకుండా.. ఈ రెంటినీ చేస్తూ మార్పును సాధించటానికి లోక్‌సత్తా ప్రయత్నించింది, ప్రయత్నిస్తోంది! ప్రధాన రాజకీయ పార్టీలు ఈ పని చేయకపోవటం వల్లే మనదేశం హ్యాపీనెస్ ఇండెక్స్‌లో దిగజారుతూ పోతోంది. ప్రజాస్వామ్యంలో అనివార్యంగా ఉండే తాత్కాలిక రాజకీయ అవసరాలను.. దీర్ఘకాలిక అవసరాలతో అనుసంధానం చేసుకుంటూనే సంధి దశను అధిగమించి, ఎజెండాను మార్చుకుంటే తప్ప– ప్రజలు కోరుకుంటున్న ఆనందాన్ని ప్రభుత్వాలు, పార్టీలు అందించలేవు. మనది ప్రజాస్వామ్య దేశం కాబట్టి ఆనంద ఎజెండాను అమలు చేయలేకపోతున్నామనేది బూటకం. అదో వంక మాత్రమే. ఈవేళ అభివృద్ధి చెందిన అనేక దేశాలు.. జపాన్, అమెరికా సహా ప్రజాస్వామ్య దేశాలుగానే ఆ వృద్ధిని సాధించాయి. ఒక్క భారతదేశంలోని రాజకీయ పార్టీలు, నాయకులు మాత్రమే ఆడలేక ప్రజాస్వామ్యం ఓడు అంటున్నారు. వాళ్లు ఈ ఎజెండాను అమలు చేయలేదు కాబట్టే.. ఉచితాలు, తాయిలాలను అందిస్తూ ప్రజల ఆగ్రహాన్ని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఒక్కసారి హ్యాపీనెస్ ఇండెక్స్‌లో ముందువరుసలో 'ఆనంద నిలయాల్లా' గుర్తింపుపొందిన దేశాలను చూడండి.**

డెన్మార్క్, కోస్టారికా, సింగపూర్.. ఇలా ఆనంద నిలయ దేశాలన్నింటిలోనూ ఒక ఏకరూపత ఉంది. ఆయా దేశాల్లో నివసించే ప్రజలంతా భద్రత, జీవన సాఫల్యతలకు సంబంధించిన కనీస అవగాహనతో జీవిస్తారు. ఎవరికివారు తమ వ్యక్తిగత జీవితాల్లో స్వతంత్ర భావాలతో ఆలోచించి ఒత్తిడిని తగ్గించుకుంటూ, ఆనందాన్ని పెంచుకోవటానికి ప్రాధాన్యమిస్తారు. ఇది వారికి ఎలా సాధ్యమైంది?

డెన్మార్క్‌లో ప్రజల జీవనశైలిలో ఆహ్లాదకరమైన శారీరక శ్రమ అంతర్భాగం. వారు ఎంత ఒత్తిడిలోనైనా ఈత వంటి శారీరక శ్రమ అధికంగా ఉండే క్రీడలలో నిమగ్నమవుతారు. ఆ దేశ పాలకులు ప్రజలకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం సదుపాయాల్ని, ఆర్థిక భద్రతల్ని నిజాయతీగా అందించే ఏర్పాటు చేశారు. ఏ ప్రభుత్వమున్నా ఇవి అంతే నిజాయతీగా అందుతుంటాయి. అందువల్లే ప్రపంచ ఆనందసూచీల్లో డెన్మార్క్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.

కోస్టారికాలో ఒక సగటు పౌరుని రోజువారీ జీవితం తీసుకుంటే.. అతను రోజుకు ఆరుగంటలు స్నేహితులు, బంధువులతో గడుపుతాడు. పనిచేసే చోటుకు కాలినడకన వెళతాడు. ప్రతిరోజూ రోజుకు ఆరుసార్లు పండ్లు, కాయగూరల్ని ఆహారంగా తీసుకుంటాడు. తనకు నచ్చిన పనిని, నచ్చిన సహోద్యోగులతో వారానికి 40 గంటలు పనిచేస్తాడు. వారాంతంలో ప్రార్థనా స్థలాల్ని సందర్శిస్తాడు. సాకర్, ఫుట్‌బాల్ వంటి ఇష్టమైన క్రీడల్ని కూడా ఆడతాడు.

డెన్మార్క్‌లోని ఓ సగటు మహిళ బంధు,మిత్రులతో కలిసి ఇంటిపనులు, పిల్లల పెంపకం వంటి పనులను పంచుకుంటూ ఆనందంగా జీవిస్తోంది. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఆమె వృత్తిరీత్యా సోషియాలజిస్టు. ప్రభుత్వం ఆమెకు, ఆమె కుటుంబానికి విద్య, ఆరోగ్య సదుపాయాల్ని మంచి ప్రమాణాలతో ఉచితంగా అందిస్తోంది. ఉద్యోగ విరమణ తరువాత కూడా ఆమెకు అవసరమైన ఆర్థిక సౌలభ్యాలు లభిస్తాయన్న నమ్మకం ఉంది. డెన్మార్క్‌లో ఆమెలాగానే ప్రజలందరూ కూడా తమకు ఏదైనా ప్రమాదం జరిగితే ఒక హక్కులాగా ప్రభుత్వం నుంచి సాయం లభించి తాము నిలదొక్కుకోగలుగుతామని నమ్ముతారు.

ఇక కోస్టారికా విషయానికొస్తే, ఆ దేశం అగ్నిపర్వతాలతో నిండి ఉంటుంది. అందువల్ల పెద్ద పెద్ద భూకమతాలు ఏర్పడే అవకాశం లేదు. ఆ దేశవాసులు ఆర్థికంగా భూస్వాములు కారు. కొద్దిపాటి ఆస్తిపాస్తులతో వాళ్లు తమకు అన్ని విధాలా అండగా నిలిచే అధ్యక్షుణ్ని ఎన్నుకుంటారు. విద్య, రక్షిత తాగునీరు, సామాజిక భద్రత, గ్రామాల్లో ఉచిత వైద్యసౌకర్యాలు, ఇతర మౌలిక వసతులే ప్రధాన లక్ష్యంగా ఆ అధ్యక్షుడు కృషి చేస్తారు. కోస్టారికాలో 1869లో ప్రాథమిక విద్యను ప్రతి విద్యార్థికీ తప్పనిసరి చేస్తూ చట్టాన్ని అమల్లోకి తెచ్చారు. ముఖ్యంగా బాలికలకు ప్రాథమిక విద్యను తప్పనిసరి చేశారు. తద్వారా 1930ల నాటికి లాటిన్ అమెరికా దేశాల్లో కోస్టారికా అత్యధిక అక్షరాస్యత కలిగిన దేశంగా ఎదిగింది. గ్రామాల్లో ఉచిత వైద్య సౌకర్యాన్ని కల్పిస్తూ 1961 నాటికి చట్టాన్ని తెచ్చింది. ఈ పట్టుదల నేటికీ కొంచెం కూడా సడలలేదు. కోస్టారికా ప్రభుత్వం సుస్థిర ప్రజాహితం దిశగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తూనే ఉంది. ఇక సింగపూర్, తదితర ప్రాంతాల విషయానికొస్తే, అక్కడి ప్రజలు ఆర్థిక పురోగతి కోసం పట్టుదలతో శ్రమిస్తారు. తద్వారా జీవన సాఫల్యాల్ని ఆస్వాదిస్తారు.

ఈ మొత్తం సారాంశం ఏమిటి?.. ప్రజల ఆనందానికి మూలం జనాకర్షక పథకాల్లో, ఉచితాల్లో, ప్రలోభాల పంపిణీలో లేదు. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాల పెంపు, గ్రామీణ-పట్టణ ప్రాంతాల అంతరాన్ని తగ్గించే చర్యలు తదితర అంశాల్లోనే ఆనందం మార్గం దాగి ఉంది. ప్రపంచ ఆనంద సూచీలో రెండో ర్యాంకు సాధించిన ఫిన్లాండ్‌లో విద్యావ్యవస్థ ఎంత అద్భుతమైన రీతిలో ఉందో మనం ఈమధ్య సోషల్ మీడియా చర్చల్లో కూడా తరచూ చూస్తున్నాం కదా! కొన్ని దశాబ్దాల వరకూ ఫిన్లాండ్‌లో కూడా చదువు మనదేశంలోలాగే అధ్వాన్నంగా ఉండేది. కానీ అభివృద్ధికి, సంతోషానికి పునాది మంచి చదువులోనే ఉందని గ్రహించి పార్టీ రాజకీయాలకతీతంగా చదువును బాగు చేసుకున్నారు. మనం మాత్రం 'మంచి చదువు'ను ఇంకా ఎన్నికల ఎజెండాగానే గుర్తించలేకపోతున్నాం. పిల్లల చదువుల కోసం తలలు తాకట్టు పెడుతున్నాం గానీ, ఆ చదువును ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని గుర్తించి డిమాండ్ చేయలేకపోతున్నాం. వైద్య చికిత్సల కోసం అప్పుల పాలవుతున్నాంగానీ, ప్రాథమిక స్థాయి నుంచి అన్ని స్థాయిల్లో మంచి ప్రమాణాల వైద్యం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదని గుర్తించి డిమాండ్ చేయలేకపోతున్నాం. ప్రపంచ ఆనంద సూచిక నివేదిక గుర్తించిన కారణాలు- స్థిరమైన ఆర్థిక ప్రగతి నుంచి కోరుకున్నట్టు జీవించే స్వేచ్ఛ వరకూ అలవోకగా లభించేవి కావు. అందుకు మనం ఒక్కళ్లమే ప్రయత్నించినా సరిపోదు. ఎందుకంటే మన జీవితంలో 70 శాతం వరకూ అంశాలు మన చేతుల్లో ఉంటాయి. మిగిలిన 30 శాతం ఇతరులతో కలిసి సాధించుకోవటం మీద ఆధారపడి ఉంటాయి. ఇలా ఉమ్మడిగా, ఇతరులతో కలిసి సాధించుకోవటంలో భాగంగానే మనం ప్రభుత్వాల్ని ఎన్నుకుంటాం. అయితే, ఇలా మన జీవితాల్లో 30 శాతం దాకా ఆక్రమించే రాజకీయాలు, పాలన.. మిగతా 70 శాతాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తాయి. మన చేతుల్లో ఉన్న అంశాల మీద మన జన్యుపరమైన ప్రభావం చాలానే ఉంటుందని శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. మన ఆనందంలో సగభాగాన్ని మన జన్యువులే నిర్ణయిస్తాయని మార్టిన్ సెలిగ్మాన్ అనే అమెరికన్ మనస్తత్వ నిపుణుడి అభిప్రాయం. మనం మెరుగవుతున్నకొద్దీ ఈ జన్యువులు కూడా మార్పులకు లోనవుతూ మెరుగవుతుంటాయి. అంటే.. మనం మెరుగ్గా ఎదగటానికి కీలకమైన

నాణ్యమైన ఆరోగ్యాన్ని, విద్యని అందించటం ప్రభుత్వాల బాధ్యతగా గుర్తిస్తే.. మన జీవితాల్లో ఆనందం కోసం 30 శాతం కంటే కూడా ఎక్కువగా రాజకీయాల్లో, పాలనలో నాణ్యతను పట్టించుకోవాల్సి ఉంటుంది!

కొంచెం లోతుగా ఆలోచించి చూడండి. పైన చెప్పిన ఆనంద ఎజెండా మొత్తం మన దగ్గరే విన్నట్టు, చూసినట్టు అన్పిస్తోంది కదా! ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వినిపించినట్టుంది కదా!! నిజమే. ఆనందమయ దేశాల్లోని ఎజెండా, ఐక్యరాజ్యసమితి ఆనంద సూచిక ప్రాతిపదికలు అన్నీ లోక్‌సత్తా ఎజెండాలో, సురాజ్య ఎజెండాలో ఉన్నవే. ఇంకా సూటిగా చెప్పాలంటే.. హ్యాపీనెస్ చిరునామా లోక్‌సత్తా! మిగతా సంస్కరణల్ని అలా ఉంచితే.. ఖర్చు భారం లేకుండా ప్రభుత్వాలు వెంటనే చేయగలిగిన 6 అంశాల్ని సురాజ్య ఎజెండాలో లోక్‌సత్తా ప్రతిపాదించి ప్రజల్లోకి తీసుకెళ్లింది. తెలంగాణ ముందస్తు ఎన్నికల్లో కూడా ఓటు వేయటానికి అభ్యర్థుల్ని, పార్టీల్ని వీటి కోసం అడగమని ప్రజల్ని కోరింది.

- ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా 'పౌర సేవల' చట్టం,
- ఖర్చు లేకుండా నాణ్యమైన పాఠశాల విద్య – ప్రతి బిడ్డకీ
- ఒక్క రూపాయి ఆర్థిక భారం లేకుండా మంచి ప్రమాణాల ఆరోగ్యం – ప్రతి కుటుంబానికీ
- మహిళల రక్షణకు స్థానిక కోర్టుల ఏర్పాటు
- వ్యవసాయంలో లాభసాటి ఆదాయం
- స్థానిక ప్రభుత్వాలకి రాష్ట్ర బడ్జెట్ నుంచే 'తలసరి' కేటాయింపు

**ఎక్కడెక్కడో వెతికే ముందు పాలనను పట్టించుకోండి,**

**ఆనంద ఎజెండా కోసం కొద్ది సమయం, వనరులు ఇవ్వండి**

ఆనందం కోసం ఎక్కడెక్కడో వెదుకుతున్నాం, ఆదాయాల్లో చాలా ఖర్చు చేస్తున్నాం, గురువులను ఆశ్రయిస్తున్నాం, పబ్‌లలో, బార్‌లలో వెతుక్కుంటున్నాం.. కానీ ఆనందానికి కీలకమైన రాజకీయాల్లో, పాలనలో మార్పులను మాత్రం పెద్దగా పట్టించుకోలేకపోతున్నాం. మనం వేసే ఓటుకు – మన పన్నుల డబ్బుకు – మన జీవితాల్లో ఆనందానికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోలేకపోతున్నాం. సమాజానికి, దేశానికి స్థానికంగా కూడా నాయకత్వాన్ని అందించలేకపోతున్నాం. ఢిల్లీలోని స్కూళ్లలో హ్యాపీనెస్ కరిక్యులమ్ అమలు చేస్తున్నారు. భూటాన్, ఢిల్లీల్లో అధ్యయనం చేసి 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాఠశాలల్లో ఆనంద పాఠాల్ని చెప్పాలని నిర్ణయించారు. హ్యాపీనెస్ కోసం ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందించి బోధించాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో ప్రకృతి, సామాజిక బాధ్యత, జీవన నైపుణ్యాలు, పర్యావరణం, ఇతరులతో మర్యాదగా ప్రవర్తించడం, అందరితో కలిసి ఆనందంగా ఉండటంతోపాటు పోటీ సంస్కృతి, అర్థం లేని సాంకేతికతల ద్వారా విద్యార్థులపై పడుతున్న ప్రతికూల ఆలోచనా ధోరణిని తొలగించటం వంటి అంశాలుంటాయి. ఇవన్నీ స్వాగతించదగ్గవే. కానీ బైటికెళ్లి తిరిగి రావటానికి భద్రత లేని, అన్యాయం జరిగితే వెంటనే న్యాయం జరిగే అవకాశం లేని, ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లి హుందాగా, గౌరవంగా, లంచాలివ్వకుండా పనిజరిగే పరిస్థితులు లేని సమాజంలో.. విలువలకు కట్టుబడినంత మాత్రాన ఆనందం లభిస్తుందా? ఆనందం రావాలంటే, పాఠశాల స్థాయిలో విద్యార్థులకు పాఠాలు చెప్పటంతోపాటు.. వాటిని వారు ఆచరించగలిగేలా పాలనలో కూడా మార్పుల్ని తేవాలి. పుస్తకాల్లో పిల్లలకు చెప్పే విలువలకు, సమాజ ధోరణులకు మధ్య అంతరం లేకుండా ఉండటం సురాజ్యంలోనే సాధ్యమవుతుంది.

మన ఆలోచనల్ని మార్చుకుని కనీసం 20 – 30 శాతం సమయాన్ని, 10 శాతం ఆదాయాన్ని సురాజ్య ఎజెండా కోసం ఇస్తే.. ఆనందం ఇక మనలోనే, మన వెంటే, మన నట్టింటే వెల్లివిరుస్తుంది. మనం ఆనందంగా ఉంటున్నామా, లేమా? అని ప్రశ్నించుకునే దీనస్థితి నుంచి.. తెలుగు రాష్ట్రాలు, భారతదేశం కూడా ఆనంద నిలయాలుగా మారుతాయి. జాతీయ స్థాయిలో ఇంకొన్ని సంస్కరణల్ని కూడా తెచ్చుకోగలిగితే ప్రపంచ ఆనందమయ దేశాల జాబితాలో మనం అగ్రస్థానానికి కూడా పోటీపడగలుగుతాం. ✧

*(ఇన్‌పుట్స్: వార్తాసంస్థలు, పత్రికలు)*

# 'పౌర సేవల' చట్టంతోనే అవినీతి అంతం ఆరంభం: జేపీ






అవినీతిపై గొంతుచించుకుంటే సరిపోదని, సరైన విధానాలతో, కార్యాచరణతో కృషి చేస్తేనే అవినీతి అంతం సాధ్యమవుతుందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎంతమంది ఉన్నామని కాకుండా.. ఎంత స్పష్టతతో సంఘటితంగా పనిచేశామన్నదే ఈ పోరాటంలో విజయానికి కీలకమన్నారు. ప్రపంచంలో పెద్దమార్పులు కొద్దిమంది మనసు పెట్టి కృషి చేయటం వల్లే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం లేకుండా పనులు జరిగేందుకు 'పౌర సేవల' చట్టం ఏర్పాటుతో అవినీతిపై పోరులో పెద్ద విజయాలు మొదలవుతాయన్నారు. ఈ చట్టాన్ని 2019లోనే సాధించుకోవాలన్నారు.

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లో నిర్వహించిన యాంటీ కరప్షన్ వాక్‌లో జేపీ ముఖ్య అతిథిగా పాల్గన్నారు.

జెండా ఊపి నడకను ప్రారంభించిన అనంతరం జేపీ మాట్లాడుతూ.. దేశంలోని దాదాపు 20 కోట్ల కుటుంబాలు ఏదోక సమయంలో చిన్న పనికి లంచాలిచ్చినట్టు వెల్లడైందని, దీన్నుంచి బైటపడాలంటే పరిష్కారాల్ని స్పష్టంగా తెలుసుకుని పని ప్రారంభించాలని జేపీ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా చేరగానే ప్రజలకు బాస్‌లుగా వ్యవహరిస్తూ ప్రజల్ని పురుగులుగా, లంచం ఇచ్చే వారుగా చూస్తున్నారన్నారు. ప్రజలు కట్టే పన్నుల డబ్బు నుంచి చాలా ఎక్కువ మొత్తాన్ని జీతాలుగా తీసుకుంటున్న ప్రభుత్వోద్యోగుల్లో అనేకమంది సక్రమంగా తమ సేవల్ని అందించకపోవటం.. మనదేశంలో రోజువారీ అవినీతికి, పరోక్షంగా పెద్దస్థాయి అవినీతికి కూడా కారణమవుతోందన్నారు. 90 శాతం ప్రభుత్వ ఆఫీసుల్లో లంచం లేనిదే పని జరగదని మనందరికీ అనుభవపూర్వకంగా తెలుసన్నారు. ఎంపీనైనా లంచం పెట్టనిదే పనికావటంలేదని ఇటీవల ఓ ప్రజాప్రతినిధి సైతం వెల్లడించటాన్ని ప్రస్తావించారు.

ఈ పరిస్థితి మారి సర్కారీ ఆఫీసుల్లో జవాబుదారీతనం, పారదర్శకత రావాలంటే.. ఎలక్ట్రానిక్ సేవలు సహా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు చేసిపెట్టాల్సిన ప్రతి పనికీ నిర్ణీత గడువు ఉండాలని జేపీ అన్నారు. ఇంటి నల్లా కనెక్షన్, పొలానికి కరెంట్ కనెక్షన్, పట్టాదారు పాసు పుస్తకం, ఇంటి ప్లాన్‌కు అప్రూవల్, ఇతర ధ్రువీకరణ పత్రాలు.. ఇలా సేవలకు చట్టబద్ధంగా ఈ పరిమితిని పెట్టాలన్నారు. గడువులోగా పని చేయకపోతే రోజుకు కనీసం రూ.100 పరిహారం చెల్లించాలన్నారు. అవినీతి అంతానికి ఇలాంటి ఏర్పాట్లు చేయకపోగా.. ఇటీవల పార్లమెంటులో అన్ని పార్టీలూ కలిసి ఒక దుర్మార్గపు చట్టసవరణ చేశాయన్నారు. గతి లేక ఓ సర్టిఫికెట్ కోసం యాభయ్యో, వందో లంచం ఇచ్చినవాడికి 7 నుంచి 3 ఏళ్లు జైలు శిక్ష, లంచం తీసుకున్న అధికారిపైన మాత్రం ప్రభుత్వం అనుమతి ఉంటేనే విచారణ.. అనే సవరణల్ని అవినీతి నిరోధక చట్టానికి ఆమోదించారన్నారు. అవినీతిపై ప్రజల్లో, యువతలో ఆవేశం తప్ప పెద్ద అవగాహన లేకపోవటాన్ని ఆసరాగా తీసుకుని ఇటువంటి మతి లేని సవరణల్ని దేశానికి అత్యున్నత వేదికైన పార్లమెంటులో పార్టీలన్నీ కలిసి చేశాయన్నారు. ఈ చట్టాన్ని మార్చాలని, అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేయాలని అన్నారు.

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలన్నీ పెద్దఎత్తున డబ్బుల్ని కుమ్మరించినా, డబ్బు పంపిణీపై ఎవ్వరూ ఎదుటి పార్టీ మీద నిర్దిష్టంగా విమర్శలు చేయలేదని ప్రజలు గమనించాలని జేపీ అన్నారు. అవినీతి నిర్మూలనకు అవగాహనతో, సంఘటితంగా యువత కదలాలని, ఈ పోరాటానికి మీడియా సహకారాన్ని అందించాలని కోరారు. అవినీతి లేని పాలన, ఓట్ల కొనుగోలు లేని ఎన్నికలు పూర్తిగా సాధ్యమని, కాకపోతే కొంత సమయం పడుతుందన్నారు. ఈ సందర్భంగా గోశాల అవినీతి నిర్మూలనపై రాంబాబు పాడిన పాట పలువురిని ఆకట్టుకుంది. అవినీతికి వ్యతిరేకంగా నిర్దిష్ట పోరాటం చేస్తామని యువత చేత జేపీ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి దేవేందర్, గిరిధర్, గంగాధర్, రాజేష్, నటుడు వాసు, శివ తదితరులు పాల్గొన్నారు. ✧

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

★ నల్లధనాన్ని అరికట్టేందుకే పెద్దనోట్ల రద్దు చేశామని మోదీ ప్రభుత్వం పదేపదే చెబుతున్నా.. దాని ప్రభావం బ్లాక్‌మనీపై ఏ మాత్రం లేదు. నోట్లరద్దు తర్వాత పలు ఎన్నికల్లో భారీ మొత్తంలో నల్లధనాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఇప్పటి (డిసెంబర్ 02) వరకు రూ.200 కోట్లకు పైనే పట్టుబడ్డాయి.

- ఓంప్రకాష్ రావత్, మాజీ సీఈసీ

★ *సుమారు రూ.3,000 కోట్లతో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ పేరుతో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించి కొన్ని వారాలు కాలేదు. పోలియో లేని దేశంగా కొనసాగడానికి కష్టంగా ఉందంటూ పోలియో వ్యాక్సిన్ కోసం భారత ప్రభుత్వం విదేశీ సహాయం అర్థిస్తోంది.*

*– సోనియా ఫలైరో, రచయిత్రి*

★ అప్పుడు (పీవీ నరసింహారావు హయాంలో) ఎన్నో సంస్కరణలు తెచ్చారు. దేశం అభివృద్ధి పథంలోకి వెళ్లింది. అంటే మన నాయకులకు ఆ సామర్థ్యం ఉంది. అది ఎప్పుడంటే... వారు పదిమందిని అడిగి నిర్ణయాలు తీసుకున్నప్పుడు! అలా కాకుండా నేనే అంతా అంటే? నేను దేవుడిని నమ్మను... అయితే నాదో ప్రార్థన... 'మా దేశానికి బలమైన నాయకుడిని ఇవ్వకు... ఒక సాధారణ ప్రజాప్రతినిధిని ఇవ్వు చాలు' అని!

- కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ

★ ఇంత జరిగినాక ఎన్నికల సందర్భంలోనైనా పాలకవర్గం సమీక్షించుకొని, తన పాలనలో దొర్లిన తప్పుల పట్ల ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి ఇసుమంత సిద్ధంగా లేదు. అటు ప్రతిపక్షం తను గతంలో నెరపిన పొరపాట్లకు పశ్చాత్తాపం ప్రకటించడానికి కొంచమైనా తయారుగా ఉన్నట్లు లేదు. పాలకులు మార్పు కార్యాచరణ చెప్పకుండా, ప్రతిపక్షాలు ప్రత్యామ్నాయాలు సూచించకుండా తమతమ వాచాలత్వంతో, వాదనాపటిమతో ప్రజలను మరోసారి బురిడీ కొట్టించవచ్చనే అపోహలలో ఉన్న వాతావరణం కనిపిస్తోంది. ఇది తెలంగాణ ప్రజలు అడుక్కచ్చుకున్న విషాదం.

- జూకంటి జగన్నాథం, కవి, రచయిత

(తెలంగాణలో ఎన్నికల తుది దశలో చేసిన వ్యాఖ్య)

★ *ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారం నుంచి తీయవలసిన అతిపెద్ద గుణపాఠం ఏమిటంటే ఆర్థిక వ్యవస్థను సులభంగా నడపగలిగిన పరిస్థితిని ప్రధాని నరేంద్రమోదీ చేజార్చుకోవడమే. చమురు ధరలు కనిష్ట స్థాయికి పడిపోయి, రుతుపవనాలు ఆశాజనకంగా ఉన్న కాలంలో కూడా ఆర్థిక రంగాన్ని మోదీ ముందుకు తీసుకుపోలేకపోయారు. పైగా మోదీ తన తప్పుల పట్ల ఇంతవరకూ ఎలాంటి పశ్చాత్తాపమూ ప్రకటించలేదు. తాను చేసిన హిమాలయ సదృశమైన తప్పులను మహాత్మాగాంధీ అంగీకరించేవారు. కానీ నరేంద్రమోదీ కేవలం ప్రధాని మాత్రమే. ఆయనేం మహాత్ముడు కాదు కదా!*

*- పెంటపాటి పుల్లారావు, రాజకీయ విశ్లేషకులు*

★ ఎన్నికల్లో జనం సమస్యలకు పెద్దపీట వేయడమంటే ఓట్లు దండుకునే తాయిలాలను విచ్చలవిడిగా ప్రకటించడం కాదు. ప్రజలకు బతుకు, మెతుకుతో ముడివడిన సమస్యలపై నిజాయతీగా చర్చించడం, సహేతుక పరిష్కారాలను అన్వేషించడం, పౌర సమాజం అండగా వాటిని అమల్లో పెట్టడమే జనం బాగోగుల పట్ల రాజకీయ పార్టీల చిత్తశుద్ధికి నిదర్శనం. దురదృష్టవశాత్తూ ఏ ఎన్నికల్లోనూ నిజమైన అంశాలు చర్చకు రావడం లేదు. చైతన్యం రేకెత్తించి ప్రజలను శక్తిమంతులుగా రూపొందించాల్సిన రాజకీయ పార్టీలు- వారిని కేవలం లబ్ధిదారులుగానో, ఎప్పటికీ చేయిచాపి అడుక్కునేవారిగానో మిగులుస్తున్నాయి. మరీ ముఖ్యంగా పుడమి సహజ సూత్రాలను తిరగరాస్తూ సాగుతున్న పర్యావరణ విధ్వంసంపై దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ నోరుమెదపకపోవడం దిగ్భ్రాంతిపరచే విషయం. 21వ శతాబ్దపు విజ్ఞానం పాలకుల అజ్ఞానం ముందు నిర్వీర్యమైపోతోంది.

– డాక్టర్ కలపాల బాబూరావు, పర్యావరణ ఉద్యమవేత్త

★ *తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 1821 మంది అభ్యర్థులుంటే మహిళలు అందులో పదో వంతు కూడా లేరు. వీరిలో దళితులు, ఆదివాసీలు మరీ తక్కువ. దీన్నిబట్టి మహిళాభివృద్ధి, మహిళల సాధికారత ఎలా ఉందో చూడొచ్చు. ఇది మహిళలకు చాలా అవమానకరమైన అంకె. వ్యవస్థలు-సమాజాలు రోజురోజుకూ వృద్ధి కావాలి. కానీ దిగజారుతున్న వైఖరులే కనిపిస్తున్నాయి.*

*మహిళలు రాజ్యాధికార కార్యాచరణను మొదలుపెట్టాలి. మహిళలంతా రాజకీయ పార్టీ పెట్టాలి.*

*– జూపాక సుభద్ర*

★ *ఆంధ్రప్రదేశ్‌లో 23 శాతం మంది చిన్నారులు వైద్య సేవలకు దూరంగా ఉన్నారు. 21 శాతం మంది అతిసార వ్యాధి నివారణకు ఎలాంటి మందులూ ఉపయోగించటం లేదు. 65 శాతం చిన్నారులు మాత్రమే అన్ని రకాల వ్యాక్సిన్లు వేయించుకుంటున్నారు. 72 శాతం మంది మాత్రమే పోలియో వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. వీటిపై గట్టిగా దృష్టి పెట్టాలి.*

*– కేంద్ర కుటుంబ ఆరోగ్యశాఖ సర్వే*

★ *మోటివేషనల్ స్పీకర్‌గా తెలుగు రాష్ట్రాల్లో తుని, రాజమండ్రి, కాకినాడ, మచిలీపట్నం, విజయవాడ వంటి నగరాలు, రాజస్తాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతోపాటు దుబాయ్, సింగపూర్, అమెరికాల్లో కూడా పర్యటించాను. అన్ని ప్రదేశాలు, అన్ని సంస్కృతులు చూసిన తర్వాత మన దగ్గర అమ్మాయిల పట్ల వివక్ష ఇంట్లోనే ఉందని తెలిసింది. డబ్బును అమ్మాయిల పెళ్లి కోసం దాచి చదువుకు ఖర్చు చేయడం లేదని తెలిసి ఆశ్చర్యమేసింది.*

*– నైనా జైస్వాల్*

★ ఫ్యూయెల్ ట్యాక్స్ పెంచినందుకు మొత్తం ఫ్రాన్స్ ప్రజలంతా రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేశారు. అదే భారత్‌లో అయితే ప్రభుత్వం మనల్ని పీల్చిపిప్పి చేసినా ఎవరం నోరు మెదపం. ట్యాక్స్‌ల గురించి మనం పట్టించుకోం. విగ్రహాలు ఏర్పాటు చేయడం, గుళ్లు గోపురాలు కట్టుకోవడంలో మనం చాలా హడావుడిగా ఉంటాం.

- షాహిద్ సిద్ధిఖీ, సీనియర్ జర్నలిస్ట్

★ *జమ్మూ కాశ్మీర్‌లో శాంతిస్థాపన విషయంలో యూపీయే-2 ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించలేదు. 2011లో ముగ్గురు సభ్యుల కమిటీ కేంద్రానికి సమర్పించిన నివేదికను అమలుచేయకపోవడంపై ఇప్పటికీ తీవ్రంగా పశ్చాత్తాపపడుతున్నాను. ఏదైనా సైనిక ఆపరేషన్ జరిగిన తర్వాత పౌర ప్రభుత్వాన్ని పనిచేయనివ్వాలి. కాశ్మీర్‌లో అది జరగడమే లేదు.*

*– పి.చిదంబరం, కేంద్ర మాజీ హోంమంత్రి*

*(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, సోషల్ మీడియా)*

# ఫలించిన లోక్‌సత్తా ప్రయత్నం..
# పేట ప్రజల దశాబ్దాల 'ఓగేరు వంతెన' కల సాకారం




లోక్‌సత్తా కృషి వల్ల చిలకలూరిపేట, పరిసర ప్రాంతాల ప్రజల మూడు దశాబ్దాల పోరాటం ఫలించింది. గుంటూరు జిల్లా చిలకలూరిపేట పట్టణ విస్తరణకు, వ్యవసాయ పనులకు అవరోధంగా ఉన్న ఓగేరు వాగుపై వంతెనకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది.

పేట అవసరాల దృష్ట్యా పట్టణంలోని బ్రహ్మంగారి గుడి వద్ద ఓగేరు వాగుపై వంతెన నిర్మాణం చేయాలని ప్రజానీకం 30 ఏళ్లుగా డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యను గత మూడున్నరేళ్లుగా లోక్‌సత్తా పార్టీ చేపట్టింది. పార్టీ నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ దీనిపై నిర్దిష్టమైన రోడ్‌మ్యాప్‌తో, ప్రజల్ని సమీకరిస్తూ, అధికారులను, ప్రజాప్రతినిధులను కలుస్తూ పోరాటం ప్రారంభించారు. ఓగేరు వాగు బ్రిడ్జి సాధక కమిటీ కన్వీనర్‌గా పార్టీలకతీతంగా కార్యక్రమాలు చేపట్టారు. 'ఇది జరిగేదా, పెట్టేదా.. మేం నిక్కర్లేసుకున్నప్పటి నుంచీ వింటూనే ఉన్నాం' అని పెదవి విరిచిన నేతలు, ప్రజాప్రతినిధులు సైతం ఆ తర్వాత లోక్‌సత్తాతో కలిసి పనిచేస్తామని ముందుకొచ్చారు. ఇందులో అధికార తెదేపా, వైకాపా నాయకులు కూడా ఉన్నారు. అయితే, వారు ఒకరిమీద ఒకరు దుమ్మెత్తిపోసుకుని రాజకీయ లబ్ధి పొందటం మీద ఎక్కువ దృష్టి పెట్టే అవకాశముందని, దీనివల్ల వంతెన మళ్లీ వెనకపట్టు పడుతుందని భావించి.. వారి ప్రత్యక్ష మద్దతును సున్నితంగా పక్కన పెట్టడం జరిగింది. 'అవసరమైనప్పుడు మీ సాయం తప్పక తీసుకుంటాం, అది కూడా పార్టీలకతీతంగా! మనకు ఓగేరు వంతెన కల నెరవేరటం ముఖ్యం.. ఇందుకు మీ అందరూ పరోక్షంగా సహకరించాలి' అని లోక్‌సత్తా కోరటంతో వారు కూడా సానుకూలంగా స్పందించారు.

ఓగేరు బ్రిడ్జి పూర్తయితే పట్టణవాసులకే కాకుండా, రైతులకు కూడా ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్‌కి, మంత్రి ప్రతిపాటి పుల్లారావు, జలవనరుల మంత్రి దేవినేని ఉమ తదితరులకు తెలియజేస్తూ లిఖితపూర్వక విజ్ఞాపనల్ని భానుప్రసాద్ అందిస్తూ వచ్చారు. ప్రజల నుంచి సంతకాల సేకరణ, పోస్టుకార్డులతో ముఖ్యమంత్రి దృష్టికీ తీసుకెళ్లారు. 2017 డిసెంబర్‌లో సురాజ్య యాత్ర సందర్భంగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ వచ్చినప్పుడు కూడా ఈ ప్రాంతాన్ని సందర్శించ చేసి రైతులతో మాట్లాడించారు. వంతెన కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానని, ప్రభుత్వంతో మాట్లాడతానని జేపీ కూడా హామీ ఇచ్చారు. ఈ క్రమంలో.. ఏడాది కిందట ఓగేరు వాగుపై వంతెన సాధ్యాసాధ్యాలు తెలుసుకోవటానికి మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ప్రతిపాదనల్ని సిద్ధమైన దశలో ప్రత్తిపాటి చొరవతో అనుమతులు, నిధులు మంజూరయ్యాయి. రూ. 8. 50 కోట్లతో వంతెన నిర్మాణం కానుంది.

"చిలకలూరిపేట పట్టణం నుంచి చీరాల వైపు వెళ్లేందుకు నృసింహస్వామి గుడి వైపు నుంచే వెళ్లాల్సి ఉంది. ఇక్కడ ఉండే చిన్నపాటి రహదారిలో స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ద్విచక్ర వాహనాలు తిరుగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తీవ్రంగా ఉంటున్నాయి. ఏళ్ల తరబడి ఈ నరకాన్ని భరిస్తున్నాం. అడ్డరోడ్డు సెంటర్‌లో కూడా ట్రాఫిక్ సమస్యగా మారింది. వంతెన నిర్మాణం




వచ్చిందంటే పరిస్థితి మరీ దారుణం. ఓగేరు వాగులో నీరు ఉన్నప్పుడు ఈదుకుంటూ పొలాలకు వెళ్తున్న సమయంలో చనిపోయినవారున్నారు. వంతెన లేక.. అంత్యక్రియలు నిర్వహించటానికి కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే ఈ సమస్యలన్నీ దూరమవుతాయి. మౌలిక వసతులు పెరిగి పట్టణం ఇంకా వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని భానుప్రసాద్ తెలిపారు.





చేపడితే ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు ఫుల్‌స్టాప్ పడుతుంది. పొలంలో పండిన పంటలను తీసుకొచ్చుకునేందుకు, పశుగ్రాసం తెచ్చుకునేందుకు, వ్యవసాయ కూలీలు, రైతులు వెళ్లేందుకు (దాదాపు 1000 కుటుంబాలుంటాయి), పండిన పంటను తెచ్చుకునేందుకు, ఇళ్లు నిర్మించుకునేందుకు ఉన్న అనేక అవరోధాలు తొలగుతాయి. పట్టణంలోని జాగుపాలెం, పాటిమీద, వడ్డెరపాలెం, రాగన్నపాలెం ప్రాంతాలకు చెందిన వారికి ఓగేరు వాగు పక్కన పొలాలు, ఇళ్లస్థలాలు ఉన్నాయి. వంతెన నిర్మాణం చేపడితే 200 మీటర్లలోనే చిన్నపసుపర్రు ప్రాంతానికి చేరుకోవచ్చు. ప్రస్తుతం 4 కిలోమీటర్ల దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. ఇది కేవలం ప్రయాసలానే కాకుండా చాలా ఆర్థికభారంగా కూడా మారింది. వర్షాకాలం

"ఓట్లు, సీట్లు లేకపోయినా కేవలం భావజాలం, హేతుబద్ధ వాదనలు, కొత్త రాజకీయ సంస్కృతి, నిబద్ధత, సంఘటిత కృషితో లోక్‌సత్తా సాధించిన విజయం ఇది. పేట ప్రజల చిరకాల స్వప్నం నెరవేరటానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు" అని భానుప్రసాద్ సంతోషాన్ని పంచుకున్నారు. ✧

















లోక్‌పాల్ నియామకం, రాష్ట్రంలో బలమైన లోకాయుక్త ఏర్పాటు, పౌర సేవల చట్టం, అధికార వికేంద్రీకరణ, నాణ్యమైన విద్య, ఆరోగ్యాలపై ఉద్యమాలకు కార్యాచరణను చర్చించేందుకు లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వరంగల్, కరీంనగర్‌లలో ఏర్పాటు చేసిన సమావేశాలు, కార్యక్రమాల్లో వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, నేతలు

Posting Date 07-01-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on January 1st 2019

“హింసలేకుండా, ద్వేషం లేకుండా, అందరికీ అవకాశాలు
కల్పిస్తూ, అందరినీ ఇముడ్చుకుంటూ జాతి నిర్మాణం
చేయాలంటే, మనం పిరికిపందల్లా పారిపోకుండా సమస్యలను
ధైర్యంగా ఎదుర్కోవాలి. అదే వివేకానంద చెప్పింది. బలమే
జీవితం, బలహీనతే మరణం. పిరికిపందలతో మనం జాతి
నిర్మాణం చేయలేము. సమస్యను
ఎదుర్కోలేము. బలహీనులతో, అర్భకులతో దేశాన్ని
బతికించలేము. బలం కావాలి, మానసిక బలం కావాలి.
శారీరక బలం కావాలి. చాతుర్యం కావాలి. గాల్లో దీపం
పెట్టి దేవుడా, దేవుడా అని పూజ చేస్తే దేవుడు వచ్చి
రక్షించడు. వివేకానందుడు మళ్లీ మళ్లీ
తన జీవితమంతా చెప్పిందదే. దేవుడి గురించి పెద్దగా
మాట్లాడడాయన. జీవితంలో ఆయన
మనిషిని గూర్చే మాట్లాడారు.
ఈ జాతిని గూర్చే మాట్లాడారు.”





- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకులు

(జనవరి 12న వివేకానంద జన్మదినోత్సవం,
జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా)

| Book-Post<br>PRINTED MATTER | To |
| --- | --- |
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad